www.quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని అన్ని జిల్లాలకు స్టాప్ రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన వారికి మాత్రమే ప్రాధాన్యం.

తగిన గౌరవ వేతనం ఇవ్వబడును.

వివరాలకు వెంటనే సంప్రదించగలరు 8886460073 8125972476 క్విక్ టుడే తెలుగు దినపత్రిక

EDITOR : GILLALA BUCHI REDDY | మల్కాజిగిరి | సంపుటి : 1 సంచిక : 159 | గురువారం, ఫిబ్రవరి 29 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8

## మేడిగడ్డకు కెసిఆర్ కూడా

# వెళ్లాలి

**కుంగిన తీరుపై ప్రజలకు క్షమాపణలు చెప్పాలి**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచన**



**హైదరాబాద్,(క్విక్ టుడే) :** భారాస నేతల మేడి గడ్డ బ్యారేజీ పర్యటనను స్వాగతిస్తున్నా మని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఇంత భారీగా అవినీతి చేసి కూడా మేడిగడ్డకు వెళ్తామ ంటున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ జలసౌధలో ఆయన మాట్లాడారు. 'భారాస నేతల మేడిగడ్డ పర్యటనకు సహకరించాలని అధికారులను ఆదేశించాం. వారి తీరు 'ఉల్టా చోర్..' సామెతను గుర్తు చేస్తోంది. భారాస మేడి గడ్డ పర్యటనకు కేసీఆర్ సైతం వెళ్లాలి. కుంగిన ఆనకట్ట సాక్షిగా రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి. మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు కట్టవద్దని నిపుణుల కమిటీ సూచించింది. కాళేశ్వరం రూపంలో రాష్ట్రంపై మోయలేని భారం మోపారు. స్వతంత్ర భారతంలో ఇంత భారీ అవినీతి గతంలో ఎన్నడూ జరగలేదు. ప్రాజెక్టుల విషయంలో భారాస సర్కారు అవినీతిని కాగ్ ఎండగట్టింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా వివరించింది' అని చెప్పారు. కమిషన్ల కోసమే గత ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం చేసిందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఇంకా ప్రాజెక్టులు పూర్తి కావడానికి లక్షాల 47 వేల కోట్లు కావాలన్నారు ఉత్తమ్. కాళేశ్వరంలో 25వేల కోట్లు పనులు ఎలాంటి డీపీఆర్ లు లేకుండా అలాట్ చేశారని అన్నారు. గత ప్రభుత్వంలో 94 వేల కోట్ల రూపాయలు కాళేశ్వరం కోసం ఖర్చు చేసి ఐదేళ్లలో 160 టీఎంసీల నీళ్లను మాత్రమే లిఫ్ట్ చేశారని చెప్పారు. ఇందులో ఇరిగేషన్ కోసం వినియోగించింది కేవలం 65 టీఎంసీలే అన్నారు.



## ఇస్రో లాంచ్‌ప్యాడ్‌కు మోడీ

# శంకుస్థాపన



**శాస్త్రవేత్తలను డిఎంకె గౌరవించడం లేదని ఆగ్రహం**

**చెన్నై,(క్విక్ టుడే) :** తమిళనాడులోని తూత్కుకుడి జిల్లా కులశేఖర పట్టణంలో ఇస్రో లాంచ్ ప్యాడ్ కు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారంనాడు శంకుస్థాపన చేశారు. అయితే, అనూహ్యంగా ఈ శంకుస్థాపన కార్యక్రమం కోసం డీఎంకే ప్రభుత్వం ఇచ్చిన 'ఇస్రో' యాడ్ తీవ్ర దుమారం రేపింది. ప్రధాని మోదీ సహా, బీజేపీ నేతలు డీఎంకేను తప్పుపట్టగా, తూత్తుకుడి ఎంపీ కనిమొళి సొంత పార్టీని సమర్ధించారు.
ఇస్రో సెకెండ్ ల్యాంచ్ ప్యాడ్ శంకుస్థాపన సందర్భంగా తమిళనాడు పశుసంవర్ధక శాఖ మంత్రి అనితా రాధాకృష్ణన్ స్థానిక పత్రికలకు ప్రకటన ఇచ్చారు. ఇందులో ప్రధానమంత్రి మోదీ, తమిళనాడు సీఎం స్టాలిన్, ఇతర డీఎంకే నేతలతో పాటు చైనా జాతీయ జెండాతో ఉన్న రాకెట్ కనిపించడంతో దుమారం రేగింది. దీనిపై బీజేపీ చీఫ్ అన్నామలై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎంకే నిబద్ధత, దేశ సౌరభౌమత్యం విస్మరణను ఇది తలపిస్తోందని, గత తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు డీఎంకే ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం అధికార డీఎంకేపై నిప్పులు చెరిగారు. డీఎంకే పనిచేయకపోవడమే కాకుండా తప్పుడు క్రెడిట్ ఆపాదించుకుంటోందని, కేంద్రం పథకాలపై వాళ్ల స్టిక్కర్లు అంటించుకున్నారని, ఇస్రో లాంచ్‌ప్యాడ్‌పై చైనా స్టిక్కర్ అంటించి క్రెడిట్ వారికి ఆపాదిస్తున్నారని విమర్శించారు. అంతరిక్ష రంగంలో భారతదేశ ప్రగతిని అంగీకరించేందుకు వాళ్లు (డీఎంకే) సిద్ధంగా లేదన్నారు. అంతరిక్ష రంగంలో భారత విజయాలను ప్రపంచానికి చాటేందుకు ఇష్టపడటం లేదని, మన శాస్త్రవేత్తలను, మన అంతరిక్ష కేంద్రాన్ని కూడా విమర్శిస్తున్నారని తప్పుపట్టారు. వాళ్లు చేసిన తప్పదాలకు శిక్ష విధించే సరైన సమయం ఇదేనని అన్నారు. చైనా రాకెట్ యాడ్‌పై మోదీ వ్యాఖ్యలను డీఎంకే ఎంపీ కె.కనిమొళి తిప్పికొట్టారు. యాడ్ ఫోటోలో ఆర్ట్ వర్క్ చేసిన వ్యక్తి ఎవరో తనకు తెలిదని అన్నారు. చైనాను శత్రుదేశంగా భారత్ ప్రకటించినట్టు తాను అనుకోవడం లేదని చెప్పారు. 'మన ప్రధాని చైనా ప్రధానిని ఆహ్వానించాను.

## త్వరలోనే అర్హులందరికి

# కొత్త రేషన్ కార్డులు

**రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**హైదరాబాద్,(క్విక్ టుడే) :** పదవులు, అధికారం శాశ్వతం కాదని, చేసిన పనులే చరిత్రలో నిలిచిపోతాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను క్రమంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఏది ఏమైనా ఇచ్చిన హామీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలతోపాటు ఇతర హామీలను కూడా నెరవేరుస్తామన్నారు. అలాగే త్వరలోనే అర్హులందరికి కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ధరణిలో సవరణలు చేసి ఎలాంటి సమస్యలు లేకుండా అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఖమ్మంలోని పాలేరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్తో కలిసి లబ్దిదారులకు కల్యాణలక్ష్మి/షాదీముబారక్ చెక్కులను తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఆ తర్వాత మహమ్మదాపురంలో రూ.5 కోట్లతో నిర్మించనున్న గిరిజన మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, వెంకటగిరిలో రూ.2.65 కోట్లతో నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన ఆరు హామీల్లో ఆర్టీసీ ఉచిత ప్రయాణ పథకం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచిందన్నారు. మరో రెండు హామీలు (ఉచిత విద్యుత్, రూ.500 సిలిండర్) కూడా అమల్లోకి తెచ్చారు.



# కవిత కేసు విచారణ 13కు వాయిదా

**న్యూఢిల్లీ,(క్విక్ టుడే) :** మహిళలను దర్యాప్తు సంస్థలు ఇంట్లోనే విచారించాలనే అంశంపై భారాస ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు మార్చి 13కు వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరగాల్సి ఉంది. అయితే, కోర్టు సమయం ముగియడంతో తదుపరి విచారణను త్వరగా జరపాలని కవిత తరఫు న్యాయవాది కపిల్ సిబల్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. మార్చి 13న చూస్తామని ధర్మాసనం తెలిపింది. కాగా, మద్యం కేసులో విచారణకు రావాలని ఈడీ జారీ చేసిన నోటీసులను గతేడాది కవిత సవాలు చేశారు. గతంలో ఆమె పిటిషన్‌ను నళినీ చిదంబరం, అభిషేక్ బెనర్జీ కేసులతో జత చేసిన విషయం తెలిసిందే. పిటిషన్లపై విడివిడిగానే విచారణ చేపట్టనున్నట్లు గత విచారణలో జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం స్పష్టం చేసింది. 3 కేసులు వేర్వేరు అని, కలిపి విచారణ చేయడం సబబు కాదని ధర్మాసనం అభిప్రాయపడింది.

## ఔటర్ రింగ్ రోడ్డు టోల్ టెండర్లలో

# అవకతవకలు

**విచారణకు ఆదేశించిన సిఎం రేవంత్**

**రీజినల్ రింగ్ రోడ్డు, ఔటర్‌లను కలిపేలా రేడియల్ రోడ్స్**

**మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌పై సిఎం రేవంత్ సమీక్ష**



**హైదరాబాద్,(క్విక్ టుడే) :** ఔటర్ రింగ్ రోడ్డు టోల్ టెండర్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ విషయంలో ఎక్కువ ఆలస్యం చేయకుండా.. వీలైనంత వెంటనే పూర్తి వివరాలు సమర్పించాలని హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలికి సూచించారు. సీబీఐ లేదా అదే స్థాయి దర్యాప్తు సంస్థకు రిపోర్ట్ ఇవ్వాలని సీఎం నిర్ణయించారు. బాధ్యులైన అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని యోచిస్తున్నట్టు తెలిసింది.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సచివాలయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్‌పై హెచ్ఎండీఏ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. ఔటర్ రింగ్ రోడ్డు లోపల వైపు ఉన్న ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని, అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. రీజనల్ రింగ్ రోడ్డు పరిధి లోపల ఉన్న ప్రాంతాన్ని హెచ్ఎండిఏ పరిధిలోకి తీసుకురావాలని చెప్పారు. వీటికి కు అనుసంధానంగా.. రేడియల్ రోడ్స్ అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. మాస్టర్ ప్లాన్-2050కి అనుగుణంగా.. విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాలని తెలిపారు. ఇదే సమయంలో.. అవుటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డుకు రేడియల్ రోడ్లకు ప్రణాళికలు రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ - 2050కి అనుగుణంగా విజన్ డాక్యుమెంట్ రూపొందించాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ప్రాంతాలను ఓ యూనిట్ గా తీసుకుని అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని.. రీజనల్ రింగ్ రోడ్డు పరిధి లోపల ఉన్న ప్రాంతాన్ని హెచ్ఎండీఏ పరిధిలోకి తీసుకు రావాలని చెప్పారు. హైదరాబాద్ ఈస్ట్ - వెస్ట్ అనే తారతమ్యాలు లేకుండా నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఒకే విధంగా అభివృద్ధి జరిగేలా ప్రణాళికలు రూపొందించాలని నిర్దేశించారు.



## తెలంగాణ వ్యాప్తంగా

# ఇంటర్ పరీక్షలు ప్రారంభం

**హైదరాబాద్,(క్విక్ టుడే) :** తెలంగాణలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రశాంతంగా పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగలేదు. అయితే ఆదిలాబాద్ జిల్లాలో బైక్‌పై వస్తున్న విద్యార్థి బస్సును ఢీకొని గాయపడ్డాడు. అతడిని ఆస్పత్రికి తరలించడంతో పరీక్ష రాయలేకపోయాడు. బుధవారం నుంచి మొదలైన పరీక్షలు మార్చి 19 వరకు జరగనున్నాయి. ఉదయమే పరీక్షా కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్షలకు హాజరయ్యారు. వీరి కోసం ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేశారు. నిమిషం ఆలస్యం అయినా ఎగ్జామ్ హాల్ లోకి అధికారులు అనుమతించ లేదు. నిమిషం నిబంధన కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది విద్యార్థులు ఎగ్జామ్ సెంటర్ నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు. కుత్బుల్లాపూర్ గాంధీ నగర్ లోని కేమ్ బ్రిడ్జ్ కళాశాల లో ఇద్దరు విద్యార్థులు నాలుగు నిమిషాలు ఆలస్యంగా రావడంతో, కళాశాల యాజమాన్యం పరీక్షా కేంద్రాల లోపలికి అనుమతించ లేదు. సిద్దిపేట జిల్లా సిద్దిపేట ప్రభుత్వ బాలుర కళాశాలకు ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు అనుమతించకపోవడంతో వెనుదిరి వెళ్లారు విద్యార్థులు.



## ప్రధాని మోడీ

# తెలంగాణ పర్యటన ఖరారు

**4,5 తేదీల్లో ఆదిలాబాద్, సంగారెడ్డిల్లో సభలు**

**హైదరాబాద్,(క్విక్ టుడే) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన షెడ్యూల్ ఖరారు అయ్యింది. రెండ్రోజుల పాటు ఇక్కడ పర్యటిస్తారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారు అయ్యింది. మార్చి 4, 5వ తేదీల్లో ప్రధాని మోదీ రెండు రోజులపాటు రాష్ట్రంలో పర్యటించనున్నారు. మార్చి 4వ తేదీన ప్రధాని మోదీ ప్రత్యేక విమానంలో హైదరాబాద్ కు రానున్నారు. అక్కడి నుంచి నేరుగా అదిలాబాద్ జిల్లా పర్యటనకు వెళ్తారు. అక్కడ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాప చేయనున్నారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించనున్నారు.

## నేడు సంత సేవాలాల్ మహారాజ్ జయంతి

**నల్లగొండ జిల్లా ప్రతినిధి. ఫిబ్రవరి 28 (క్విక్ టుడే) :**
శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవం ఈనెల 29 న క్లాక్ టవర్ సెంటర్లో నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా బంజారా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆంగోత్ ప్రవీణ్ నాయక్



వెల్లడించారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ మహారాజ్ అని కొనియాడారు. ఎన్నో సంవత్సరాలుగా గిరిజనులు కోరుతున్న కోరికను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన్నించి ఈనెల 15న సంతు జవహర్‌లాల్ పుట్టినరోజు సెలవుదినంగా ప్రకటించినందుకు గిరిజనులు కృతజ్ఞత అభినందనలు తెలిపారు. ఈనెల 29 నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవానికి పార్టీలకతీతంగా గిరిజన సంఘ నాయకులు, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు గిరిజన ఉద్యోగ ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కార్మిక సంఘం అధ్యక్షులు కేతావత్ నగేష్ నాయక్, లీగల్ అడ్వైజర్ రమావత్ నాగార్జున నాయక్, మత్స్యశాఖ లకావత్ రవి నాయక్, మాజీ సర్పంచ్ నరసింహ నాయక్, ట్రైబల్ వెల్ఫేర్ ఆంగోతు విజయ్ నాయక్, లంబాడ హక్కుల పోరాట సమితి రమావత్ సక్కునాయక్, సురేందర్ నాయక్ తదితరులు. ఈ కార్యక్రమంలో పాల్గొని గురువారం రోజున గడియారం సెంటర్లో శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవ కార్యక్రమానికి అధిక సంఖ్యలో గిరిజన నాయకులు, ఉద్యోగులు విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## తన ప్రతిష్టను తానే దిగజార్చుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### బిజెపి నల్లగొండ జిల్లా మీడియా కన్వీనర్ పాలకూరి రవి గౌడ్



**నల్లగొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 28 (క్విక్ టుడే) :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజల చేత ఎన్నుకోబడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన స్థానాన్ని గుర్తించుకోకుండా, తన స్థాయిని తగ్గించుకునేలా పదేపదే బిజెపిపై విమర్శలు చేయడం అనైతిక చర్య అని బిజెపి జిల్లా మీడియా కన్వీనర్ పాలకూరి రవి గౌడ్ విచారం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో చీకటి ఒప్పందాలతో టిఆర్ఎస్ బిజెపి రెండూ ఒకటే అని ముఖ్యమంత్రి మాట్లాడడం సరైనది కాదని అన్నారు...అవకాశాల కోసం అడ్డదారులు తొక్కే కాంగ్రెస్ టిఆర్ఎస్ పార్టీలు బిజెపితో ఎప్పటికీ సరితూగలేవని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో నరేంద్ర మోడీ ని ఢీకొనలేక పదేపదే ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకోవడానికి వ్వరూతలుగుతున్నది కాంగ్రెస్ పార్టీ కాదా అని రవి గౌడ్ అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో అత్యధికమైన స్థానాలను ఒంటరి పోరులో భారతీయ జనతా పార్టీ కైవసం చేసుకుంటుందని ఏ ఇతర పార్టీలతో కూడా బిజెపి పార్టీ పొత్తు పెట్టుకోదని అన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు కొనసాగుతున్నప్పటికీ తన ప్రవర్తనల ఓటుకు నోటు వ్యవహారం తీరులాగే ఉందని అలాంటి విధానం బిజెపి పార్టీలో కార్యకర్తల్లో కూడా ఉండదని రవి గౌడ్ అన్నారు.
ముఖ్యమంత్రి, భారతీయ జనతా పార్టీపై విమర్శలు చేసే ముందు ఒకసారి ఆలోచించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి బిజెపి జిల్లా మీడియా కన్వీనర్ పాలకూర రవి గౌడ్ గుర్తు చేశారు.

## డీఎస్పీ కె.శివరాంరెడ్డిని కలిసిన ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు




**నల్లగొండ, .ఫిబ్రవరి 28 (క్విక్ టుడే) :**
నల్లగొండ సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కె.శివరాంరెడ్డి ని ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవాలి !

కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించడం లేదు. ప్రతిదానికి కేంద్రం సాయాం చేయాలని దేబురిస్తున్నాయి. అదేపనిగా అప్పులు చేస్తూ ప్రజలపై భారం మోపుతున్నాయి. తెలంగాణనే తీసుకుంటే 75వేల కోట్లు వడ్డీలు కట్టాల్సి వస్తోందని సిఎం రేవంత్ రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు చూస్తే గత కెసిఆర్ ప్రభుత్వం చేసిన అప్పులు ఎంతగా పెరిగాయో గమనించవచ్చు. ప్రభుత్వ నిర్వహణ అంటే కేవలం అప్పులు చేసి, ప్రజలకు నగదు బదిలీ చేయడం అని జగన్ నిరూపించారు. రాష్ట్రాలన్ని ఇలా దివాళా దిశగా ఉన్నాయి. ఎక్కడా అభివృద్ధి కన్నా ఓట్లు రాబట్టే పథకాలే సాగుతున్నాయి. ఇందుకు ఏ రాష్ట్రం కూడా మినహాయింపు కాదు. అభివృద్ధి పక్కకు పోయింది. తెలంగాణలో కాళేశ్వరంపై తప్పులు ఒప్పుకోకుండా బిఆర్ఎస్ ఎదురుదాడికి దిగుతోంది. ఏ పథకం తీసుకున్నా అవినీతి కనిపిస్తోంది. నోరుంది కదాని బిఆర్ఎస్ నేతలు చేస్తున్న విపరీత వ్యాఖ్యలు,ఆరోపణలు జుగుప్స కలిగిస్తున్నాయి. ఇకపోతే కేంద్రంలో మోడీ ద్వయం రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని చేస్తున్న విన్యాసం చూపరులకు విసుగు తెప్పిస్తోంది. అయితే మోడీని ప్రశ్నించే ముందు తమ రాష్ట్రాల్లో తాము ఎంత సచ్ఛీలంగా పాలన చేస్తున్నామో ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు గమనించాలి. ప్రజలు చేస్తున్నవిమర్శలకు సమాధానం చెప్పాలి. అలాగని కేంద్రం అధికార దుర్వినియోగాన్ని తప్పు పట్టకుండా ఉండలేం. కేంద్రం చేస్తున్న దుర్వినియోగాన్ని, దుర్మార్గాలను ఎండగట్టాల్సిందే. ఇకపోతే ఆదానీ కుంభకోణాలపై, మోసాలపై చలనం లేని బిజెపి ప్రభుత్వం..సిసోడియా విషయంలో మాత్రం దూకుడు ప్రదర్శించింది. నిజానికి మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు కేవలం కక్షసాధింపు వ్యవహారంగా కనిపిస్తోంది. ఎంతమంది అవినీతికి పాల్పడ్డారో వారందరినీ ఒకే గాటన కట్టివుంటే బాగుండేది. రాజకీయ అవినీతిని, కార్పోరేట్ మోసాలను అరికట్టే విషయంలో ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ మోడీ మాత్రం విమర్శలను పట్టించుకోవడం లేదు. ప్రజాస్వామ్యాన్ని పట్టించుకోవడం లేదు. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని ఎంతకాలం ఇలా ముందుకు వెళతారన్నది చూడాలి. సిబిఐ, ఐటి, ఇడి దాడులపై వస్తున్న ఆరోపణలను పట్టించుకోవడం లేదు. ఆయా రాష్ట్రాల్లో చిచ్చు పెట్టి అధికారాన్ని చేజిక్కించు కుంటున్న తీరు కాంగ్రెస్ పాలనకన్నా దారుణంగా ఉంది. వ్యవస్థలను భ్రష్టు పట్టించిన ఘనత కాంగ్రెస్ దయితే..అంతకుమించిన దారుణాలను ఇప్పుడు మోడీ అనుసరిస్తున్నారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టే ఇలాంటి చర్యలు సమర్థనీయం కాదు. ప్రజల సమస్యలను ప్రధానంగా పరిష్కరిస్తూనే...అవినీతి నేతలను బొక్కలో తోయాల్సిందే. రాజ్యాంగ సంస్థలు అందరి విషయంలో సమన్యాయంతో వ్యవహరించాల్సిన బాధ్యత వుంది. భారత ప్రజాస్వామ్యం పదికాలాలపాటు పటిష్టంగా నిలదొక్కుకోవాలంటే రాజ్యాంగ వ్యవస్థలు పటిష్టంగా పనిచేయాలి. నిష్పాక్షికంగా నిర్ణయాలు తీసుకోవాలి. అధికారంలో ఉన్న సమయంలో అధికార పార్టీకి కొమ్ముకాసే విధంగా ఉండరాదు. ఇది ఒక్క కేంద్రం విషయంలో మాత్రమే జరగడం లేదు. రాష్ట్రాల్లో నూ ఇలాగే వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారు. కేంద్రాన్ని విమర్శిస్తున్న ప్రాంతీయ పార్టీల నేతలు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉంటే అవి రాజకీయ జోక్యంతో రాజ్యాంగ సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుంటు న్నాయి. అందుకే రాజ్యాంగ సంస్కరణలు రావాలని కొందరు మేధావులు కోరు కుంటున్నారు. ప్రధానంగా వివిధ దర్యాప్తు సంస్థలు, ఎన్నికల సంఘం,ప్రణాళికా సంఘం అంటే నీతి ఆయోగ్, యూనియన్ పబ్లిక్ సర్వీస్కమిషన్, కంప్ట్రోలర్ అండ్ ఆడిట్జనరల్ వంటి అనేక సంస్థలు జవాబు దారీగా ఉండేలా పటిష్ట రాజ్యాంగం అవసరం. దేశ సమాఖ్య విధానంలో సహకార స్ఫూర్తిని పెంపొందించాల్సిన కేంద్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. భారత రాజ్యాంగ సంస్థల పట్ల విశ్వసనీయత పెరగాలి. అవి తీసుకునే నిర్ణయాలు ఏకపక్షంగా ఉండకుండా చూసుకోవాలి. అందుకు దేశవ్యాప్తంగా చర్చచేయాలి. రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకుని స్వారీ చేసే పాలకుల తీరు మారాలి. ఇలాంటి పాలకులు వస్తారని బహుశా రాజ్యాంగ రచన చేసిన వారు ఊహించ ఉండరు. అందువల్ల వ్యవస్థలను బలోపేతం చేస్తూ..రాజకీయజోక్యం లేని పాలనా సంస్థలను రూపొందించుకోవాలి. కేంద్రంలో లేదా రాష్ట్రంలో అధికరాంలో ఉన్న పార్టీలు తమ అవసరాలకు వాటిని దుర్వినియోగం చేసే విధానాలకు చెక్ పెట్టాల్సిన అసవరం ఏర్పడింది. ప్రజలు అప్రమత్తంగా లేకుంటే పాలకులు స్వారీ చేస్తారని ప్రజలు గుర్తించాలి. ఇలా ప్రజలు నిద్రలో ఉన్నంత కాలం పాలకుల తమ విధానాలనే రుద్దుతారు. తాము చేసిందే కరెక్ట్ అని చెబుతారు. దీనిని అడ్డుకోవడం అన్నది ప్రజలు తమ కర్తవ్యంగా గుర్తించాలి. తాము అప్పగించిన అధికారం దుర్వినియోగం కాకుండా చూసుకోవాలి. ఎన్నికల వేళ ఇలాంటి అనర్థాలపై ప్రజలు చర్చించాలి. రాజ్యాంగ వ్యవస్థల పనితీరు, పాలకుల పనితీరు, అవినీతి పాలనలపై చర్చించాలి. ఎవరు అవినీతికి పాల్పడినా క్షమించరాదు. అందుకు అనుగుణంగా కార్యక్రమాలను ప్రజలే రచించాలి. మేధావులు కూడా మౌనంగా ఉండరాదు. రాజ్యాంగ పరిరక్షణతో పాలకుల అవినీతి, అక్రమాలపై మేధావులు గొంతెత్తాలి. నిరంతరం ప్రజలను జాగరూకత పర్చాలి. సెమినార్లు నిర్వహించాలి. చర్చాగోష్టులు చేయాలి. పాలకుల అవినీతి, అక్రమాలపై గొంతెత్తి నిలదీయాలి.

# ఇండియా కూటమి బలపడుతుంది

### బిజెపికి ఇక నూకలు చెల్లినట్లే
### ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన మోడీ
### కాంగ్రెస్ నేత మల్లు రవి



**హైదరాబాద్,ఫిబ్రవరి28:** కేంద్రంలో మోడీకి వ్యతిరేకంగా మిషన్ మొదలయ్యిందని...ఇక బిజెపి ఆటలు సాగవని కాంగ్రెస్ సీనియన్ నేత మల్లు రవి అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న మోడీకి ప్రజలు గుణపాఠం చెప్పడం ఎంతో దూరం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి ప్రజలకు అండగా ఉంటుందని అన్నారు. బిజెపి దేశానికే కాదు... రాష్ట్రాలకు కూడా ఏమీ చేయలేదని ప్రజలు కూడా గుర్తించారని అన్నారు. అలాంటి బిజెపిని ఎంత త్వరగా సాగనంపితే అంతమంచిదని అన్నారు. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం గతంలో ఎప్పుడూ ఇంతగా జరగలేదన్నారు. తమ స్వార్థం కోసం బిజెపి ఎంతటి చర్యలకైనా దిగుతోందన్నారు. విపక్షాలు లక్ష్యంగా చేస్తున్న ఈ చర్యలను ప్రజలు గమనించారని అన్నారు. ప్రజలు అంత అమాయకులు కాదుకదా అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళారీలను బాగు చేయడం మినహా ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు. ప్రజల కోసం చేసిన ఒక్క మంచి పథకం ఏదో చెప్పాలని బీజేపీకి సవాల్ విసిరారు. ఆదానీ, అంబానీలకు దోచిపెడుతున్న తీరు వల్ల దేశ అర్థిక వ్యవస్థ దిగజారిందన్నారు. ఢిల్లీలోని బీజేపీ సర్కారును గద్దె దింపే కార్యక్రమం మొదలైందని మల్లురవి వ్యాఖ్యానించారు. ఇండియా కూటమికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక బీజేపీ కుట్రలు పన్నుతున్నదని మండిపడ్డారు. అన్ని పార్టీలు కలసి ముందుకు వస్తున్నాయని, విభేదాల సృష్టించి పబ్బం గడుపుకోవాలని బిజెపి ప్రయత్నాలు చేస్తోందని
అన్నారు. బిజెపి పునాదులు కదులుతున్నాయని అన్నారు. అభివృద్ధికి సహకారం అందించవలసిందిగా కేంద్రంలోని బీజేపీని రాష్ట్రాలు అభ్యర్థిస్తున్నా పట్టింపు లేదు. జిఎస్టీ భారాలను పట్టించుకోవడం లేదు. అలాగే బిజెపికి రాష్ట్రాలను అభివృద్ధి చేయాలన్న కాంక్ష లేదన్నారు. ఈ నేపథ్యంలో తాము మొదలెట్టిన ప్రత్యామ్నాయ ప్రయత్నం విజయవంతం అవుతుందన్నారు. రాహుల్ నాయకత్వంలో ప్రత్యామ్నాయ వేదిక అయిన ఇండియా కూటమిని ఏర్పాటు చేసి మోడీని గద్దె దించేందుకు సమరశంఖం పూరించామని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా గొంతు కలుపుతున్న అన్ని రాష్ట్రాలు కూడా ఇప్పుడు ఏకం అయ్యాయని అన్నారు. నరేంద్ర మోదీ వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించడానికి అందరూ అర్హులేనని ఇతరులకు అభ్యంతరాలు లేవని అన్నారు. బీజేపీనే మళ్లీ అధికారం లోకి వస్తే పరిస్థితి ఏమిటన్నదే ఇప్పుడు అందరిలోనూ చర్చగా మారిందన్నారు. బిజెపికి అంత సీన్ లేదని రానున్న రోజుల్లో మరింత స్పష్టత రాగలదని కాంగ్రెస్ నేత అన్నారు. అందుకే ఇప్పుడు ప్రతి ఒక్కరూ కూటమి వైపు చూస్తున్నారని అన్నారు. అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు అందాలన్నది తమ ఆకాంక్ష అని తెలిపారు.

# కాంగ్రెస్ హాట్ సీటుగా ఖమ్మం

### అందిరి కన్నా ఈ సీటుపైనే
### వీహెచ్, కుసుమ కుమార్‌ల దృష్టి
### ముగ్గురు మంత్రుల కుటుంబసభ్యుల కర్చీఫ్
### తమకే కేటాయించాలంటున్న సీపీఐ

**ఖమ్మం,ఫిబ్రవరి28:** పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆశావహులకు ఖమ్మం సీటు హాట్ కేక్‌లా మారింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించడంతో కాంగ్రెస్ పార్టీకి ఇది గ్యారెంటీగా మారింది. దీంతో అందరి కన్నా ఖమ్మంపై పడింది. కాటికి కాళ్లు చాపుకున్న వారు కూడా మేము సైతం అంటున్నారు. ఇక్కడ ప్రధాన పోటీదారుగా ఉన్న మాజీమంత్రి రేణుకాచౌదరి రాజ్యసభకు వెళ్లడంతో మరికొందరికి ఇప్పుడు ఈ సీటుపై కన్నుపడింది. అయితే అదిష్టానం ఎవరికి గ్రీన్ సిగ్నల్ ఇస్తుందన్నది పక్కన పెడితే ఎవరికి వారు తామే అర్హులమని కాంగ్రెస్‌లో ప్రచారం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో తాజాగా సీనియర్ నేత విహెచ్ కూడా ముందు వరసలోకి వచ్చారు. నాకు అన్యాయం జరిగింది కనుక ఖమ్మం సీటు ఇవ్వాలన్నది ఆన అభిమతంగా ఉంది. ఇప్పటికే రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహరి స్తున్న ముగ్గురు మంత్రుల కుటుంబసభ్యులు టికెట్ రేసులో ఉండగా, ఇప్పుడు మరికొన్ని కొత్త ముఖాలు తెరపైకి వస్తున్నాయి. తమకంటే తమకే అవకాశం కల్పించాలంటూ పార్టీ సీనియర్లు బహిరంగంగా కోరుతున్నారు. ఇలా ఖమ్మం టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న డజన్ మంది లీడర్లు ఎవరి ప్రయత్నాల్లో వారుంటే, పొత్తుల్లో భాగంగా ఈ సీటును తమకు కేటాయించాలని సీపీఐ పట్టుబడుతుండడం ఆసక్తి రేపుతోంది. మొత్తంగా ఖమ్మం పార్లమెంట్ కోసం కాంగ్రెస్‌లో పోటీ ఎక్కువయ్యింది. తొలుత ఇక్కడి నుంచి సోనియాను బరిలోకి దింపాలని రాష్ట్ర కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ మేరకు తీర్మానం కూడా చేసింది. అయితే అనూహ్యంగా సోనియా రాజ్యసబకు వెళ్లి పోయారు. కనుక ఆమె ఇక పోటీచేసే అవకాశం లేదు. ఒకవేళ ప్రియాంక ఓకే చెబితే ఇక పోటీ అన్నది ఉండదు. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ రాజకీయాల్లో ఉంటూ, సోనియా కుటుంబానికి వీరవిధేయుడిగా చెప్పుకునే వీహెచ్ కూడా ఖమ్మం సీటు కోసం పట్టుపడ్తున్నారు. తనకంటే అర్హతలెవరికి ఉన్నాయో చెప్పాలని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఇక కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్ కూడా తాజాగా రేసులోకి వచ్చారు. హైదరాబాద్ సెంట్రిక్ గా పాలిటిక్స్ చేసే ఆయన, ఇటీవల ఖమ్మం డీసీసీ ఆఫీసులో ప్రెస్ మీట్ పెట్టి మరీ ఖమ్మం పార్లమెంట్ టికెట్ తనకివ్వాలని హైకమాండ్‌ను కోరారు. ఇక డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భార్య నందిని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్‌తో పాటు వ్యాపారవేత్త వీవీసీ రాజేంద్రప్రసాద్ కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. మాజీ కేంద్రమంత్రి రేణుకాచౌదరికి కాంగ్రెస్ ఇటీవల రాజ్యసభ సీటు కేటాయించడంతో ఆమె పోటీ నుంచి తప్పుకున్నారు. లేదంటే ఆమో కూడా రేసులో ఉండేవారే! మరోవైపు కామ్రేడ్లు కూడా ఖమ్మం సీటుపై కన్నేశారు. అసెంబ్లీ ఎన్నికల టైంలో కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకొని, ఒక్క అసెంబ్లీ సీటుతో సరిపెట్టుకున్న సీపీఐ, ఇప్పుడు తమకొక పార్లమెంట్ సీటు కేటాయించాలనే డిమాండ్ పెట్టింది. రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్‌తో చర్చలు జరిపినప్పటికీ పొత్తులు, సీట్ల సర్దుబాటుపై నిర్ణయం హైకమాండ్‌దేనని ఇక్కడి లీడర్లు స్పష్టం చేయడంతో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో సీపీఐ జాతీయ నేతలు చర్చించినట్టు సమాచారం. రాష్ట్రంలో తమకు పట్టున్న ఐదు ఆప్షన్లను కామ్రేడ్లు ముందుకు తెస్తున్నారు. ఖమ్మం, వరంగల్, నల్గొండ, భువనగిరి, పెద్దపల్లి స్థానాల్లో ఏదో ఒకటి కేటాయించాలని కోరుతున్నారు. ఇటీవల కొత్తగూడెం అసెంబ్లీ సీటును గెల్చుకోవడంతో పాటు సంస్థాగతం గా బలంగా ఉన్న ఖమ్మం పార్లమెంట్? స్థానం వైపే సీపీఐ మొగ్గుచూపుతోంది. 2014 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌తో సీపీఐ పొత్తు పెట్టుకోగా, ఖమ్మం సీటును సీపీఐకి ఇచ్చారు. ఆ పార్టీకి అప్పుడు రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న కె.నారాయణ ఖమ్మం లోక్‌సభ సెగ్మెంట్ నుంచి పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. మళ్లీ ఇప్పుడు తమకే కేటాయించాలని సీపీఐ కోరుతోంది. 2014 ఎన్నికల్లో వైసీపీకి సీపీఎం మద్దతివ్వగా, అప్పుడు వైసీపీ తరపున పోటీ చేసిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గెలిచారు. ఇప్పుడు ఆయన కాంగ్రెస్‌లో ఉండగా, సొంత తమ్ముడు ప్రసాద్ రెడ్డికి టికెట్ ఇప్పించుకునే ప్రయత్నాల్లో ఉన్నారు.

జన్మదిన, వివాహ
పదవీ విరమణ
శుభాకాంక్షలు

ఉద్యోగం, వ్యాపారం
రియల్ ఎస్టేట్
బహిరంగ ప్రకటనలు

జయంతి, వర్థంతి
శ్రద్ధాంజలి, నిర్యాణము
అన్ని రకాల ప్రకటనల కోసం సంప్రదించండి
88864 60073
81259 72476

## ఆన్‌లైన్‌లో ఆవులను కొనుగోలు చేస్తూ
# రూ. 22,000 పోగొట్టుకున్న రైతు



**హైదరాబాద్:** భారత్‌లో ఆన్‌లైన్ సర్వీసులు అధికమవడంతో గ్యాడ్జెట్స్ నుంచి గ్రాసరీస్ వరకూ అందుబాటు ధరల్లో అన్నీ లభిస్తు న్నాయి. అయితే ఆన్‌లైన్‌లో మనం చూసి నవన్నీ సరైనవే అనుకోవడం పొరపాటే. పెరు గుతున్న డిజిటల్ వేదికలతో స్కామర్లు కూడా అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ వేదికగా రెచ్చిపోతున్నారు. రోజుకో తరహా స్కామ్‌తో అమాయకులకు టోకరా వేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు.ఇక లేటెస్ట్‌గా గురుగ్రాంకు చెందిన డెయిరీ రైతు ఆన్‌లైన్‌లో ఆవులు కొనుగోలు చేస్తూ రూ. 22,000 పోగొట్టుకున్నాడు. పండాలాలో నివసించే సుఖ్బీర్ (50) అనే రైతు ఆన్‌లైన్ స్కామ్‌లో మోసపోయాడు. ఆఫ్‌లైన్ రేట్స్‌తో పోలిస్తే చాలా తక్కువ ధరకు ఆన్‌లైన్‌లో ఆవులను విక్రయించే ప్రకటన సుఖ్బీర్ చూశాడు. ఈ డీల్ గురించి తన తండ్రి ఆరా తీయడంతో ఆయన వాట్సాప్‌కు ఆవుల ఫొటోలు పంపారని, ఒక్కో ఆవును రూ. 35,000కు విక్రయిస్తామని ఆఫర్ చేశారని సుఖ్బీర్ కుమారుడు ప్రవీణ్ వెల్లడించాడు.అయితే నాలుగు ఆవులు కొనుగోలు చేస్తానని తన తండ్రి తెలుపగా వారు ధరను రూ.95,000కు తగ్గించారని చెప్పాడు. ఆ ఆవులు గోశాలలో నమోదయ్యాయని తప్పుడు సమాచారం ఇచ్చారని తెలిపాడు. ఇది సరైన డీల్ అనుకున్న సుఖ్బీర్ జనవరి 19, 20 మధ్య రూ. 22999 విలువైన లావాదేవీలు జరిపాడు. స్కామర్లు మరింత డబ్బు డిమాండ్ చేయడం, వాస్తవంగా ఆవులు కొనుగోలు చేసేందుకు లేకపోవడంతో అనుమానం వచ్చిన సుఖ్బీర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగుచూసింది.

# విద్యుత్ షాక్‌తో యువరైతు మృతి..
## జోగులాంబ జిల్లాలో ఘటన



**జోగులాంబ గద్వాల :** విద్యుత్ షాక్‌తోఓ యువరైతు మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన జోగులాంబ గద్వాలధరూర్ మండలం నెట్టెంపాడు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లొడ్డ తిప్పన్న (30) అనే వ్యక్తి తమ వ్యవసాయ పొలంలోని బోరు మోటర్ దగ్గర ప్రమా దవశాత్తు కేబుల్ వైర్‌కు తగిలి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వ జిల్లా దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు సమాచారం. తిప్పన మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

## ఇద్దరు మహిళల నాయకత్వంలో పని చేస్తూ
## మగతనం గురించి మాట్లాడటమా?
# : కడియం శ్రీహరి



**హనుమకొండ :** సీఎం రేవంత్ రెడ్డిపై స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్ అయ్యాక భాష మార్చుకుంటాడని అనుకున్నా. కానీ రోజు రోజుకు సహనాన్ని కోల్పోయి ప్రతిపక్షంపై దాడి చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హనుమ కొండలో ఆయన మీడియా సమావేశాంలో మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలపై మాట్లాడుతున్న వారిపై దాడులు చేయడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాల్సిన సీఎం రేవంత్ రెడ్డి తీరు జుగుప్సాకరంగా ఉందని మండిపడ్డారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త రాష్ట్రమైన తెలంగాణను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దారు. కేంద్ర ప్రభుత్వం, అంతర్జాతీయ సంస్థల మెప్పుపొందారని గుర్తు చేశారు. తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారని చెప్పారు.కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయం కోసమే వాడుకుంటుందని విమర్శించారు. చిన్న చిన్న లోపాలు ఉంటే సరి చేసి రైతులకు నీళ్లందించాలి. ఏవైనా తప్పులు జరిగితే చర్యలు తీసు కోవాలని మేమే చెబుతున్నాం. అలాం టప్పుడు రాజకీయం చేయడమేంటని ప్రశ్నించారు.

కాంగ్రెస్ పేరుకే జాతీయ పార్టీ కానీ అదో కుటుంబ పార్టీ అని ఆరోపించారు.రాజకీయాలకు మగతనానికి సంబంధం ఏంటి? సోనియా, ప్రియాంక ఇద్దరు మహిళల నాయకత్వంలో పనిచేస్తూ మగతనం గురించి మాట్లా డుతున్నాడని ఎద్దేవా చేశారు. మల్కాజ్‌గిరి సెగ్మెంట్‌లో ఒక్క సీటు ఎందుకు గెలుచుకోలేక పోయావని ప్రశ్నించారు. కాళేశ్వరంపై చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టడానికే మేడిగడ్డకు బీఆర్ఎస్ వెళ్తోందన్నారు. రేవంత్ రెడ్డి ఒక రాష్ట్రానికి సీఎం అనే విషయం గ్రహించి భాష మార్చుకోవాలని హితవు పలికారు.

# అక్రమ మైనింగ్ కేసులో..
# అఖిలేష్ యాదవ్‌కు సీబీఐ సమన్లు



**లక్నో:** ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) బుధవారం సమన్లు ?జారీ చేసింది. అక్రమ మైనింగ్ కేసుకు సంబంధించిన విచారణ కోసం ఫిబ్రవరి 29న తమ కార్యాలయంలో హాజరు కావాలని ఆదేశించింది. అఖిలేష్ యాదవ్‌ను ఈ కేసులో సాక్షిగా సీబీఐ గురువారం ప్రశ్నించనున్నది.కాగా, ఉత్తరప్రదేశ్‌లోని ఏడు జిల్లాలైన షామ్లీ, కౌశాంబి, ఫతేపూర్, డియోరియా, సహరాన్‌పూర్, హమీర్‌పూర్, సిద్ధార్థనగర్‌లో అక్రమ మైనింగ్ కేసులు నమోదయ్యాయి. 2012-2016 మధ్య ప్రభుత్వ అధికారులు నియమాలు, నిబంధనలను ఉల్లంఘించి మైనింగ్ సైట్‌లను కొందరికి అక్రమంగా కేటాయించినట్లు సీబీఐ ఆరోపించింది. ఎన్‌జీటీ ఆదేశాలను ఉల్లంఘించి మైనింగ్ హక్కులు ఇచ్చినట్లు అభియోగాలు మోపింది. 2012- 2013 జూన్ మధ్య మైనింగ్ శాఖ నిర్వహించిన అఖిలేష్ యాదవ్‌ను సాక్షిగా విచారణకు రావాలంటూ సీబీఐ సమన్లు జారీ చేసింది.

# త్వరలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ
# : మంత్రి పొంగులేటి




**హైదరాబాద్ :** పదవులు, అదికారం శాశ్వతం కాదని, చేసిన పనులే చరిత్రలో నిలిచిపో తాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎ న్ని కల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను క్రమంగా అమలు చేస్తున్నామని చెప్పారు.

# ఐదు హెల్దీ బ్రేక్‌ఫాస్ట్ ఆప్షన్స్ ఇవే..!



**హైదరాబాద్:** మనం రోజులో ముందుగా తీసుకునే ఆహారం బ్రేక్‌ఫాస్ట్ ఎంత హెల్దీగా ఉంటే మనం రోజంతా అంతా హుషారుగా, చలాకీగా ఉండగలుగుతాం. అల్పాహారంలో ప్రొటీన్, ఫైబర్ అధికంగా ఉండేలా చూసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఆరోగ్యకర ఆహారంతో రోజును ప్రారంభించడం ఆరోగ్యానికి శ్రేయస్కరం.రుచితో పాటు పోషకవిలువలు అధికంగా ఉండే ఆహారం రోజంతా ఉత్సాహంగా మనం చేయాల్సిన పనులు చక్కబెట్టేందుకు అవసరమైన శక్తిని సమకూరుస్తాయి. ఎగ్‌తో అవకాడో టోస్ట్ మేలైన బ్రేక్‌ఫాస్ట్‌కు సరైన ఎంపికని న్యూట్రిషనిస్టులు చెబుతున్నారు.ఇక ఫైబర్, ప్రొటీన్, సహజ చక్కెరలతో కూడిన పీనట్ బటర్, బనానాతో కూడిన ఓట్‌మీల్‌ను అల్పాహారంగా తీసుకుంటే రోజంతా ఎనర్జిటిక్‌గా ఉండొచ్చు. ఇక మెరుగైన ఆరోగ్యానికి ఐదు హెల్దీ బ్రేక్‌ఫాస్ట్ రెసిపీలను పరిశీలిస్తే.

# వివాహ ప్రతిపాదనను నెరవేర్చకపోవడం
# మోసం కాదు: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** వివాహ ప్రతిపాదన నెరవేర్చకపోవడం మోసం కాదని సుప్రీంకోర్టు తెలిపింది. ఒక వ్యక్తిపై నమోదైన చీటింగ్ కేసును కొట్టివేసింది. కర్ణాటకకు చెందిన రాజు కృష్ణ షెడ్‌బాల్కర్, అతడి తల్లి, సోదరి, సోదరులపై ఒక మహిళ చీటింగ్ కేసు పెట్టింది. అతడ్ని తగిన వరుడిగా భావించిన తన తండ్రి పెళ్లి వేదిక బుక్ చేసేందుకు రూ.75,000 ఇచ్చాడని తెలిపింది. అయితే ఆ వ్యక్తి మరో మహిళను పెళ్లాడినట్లు తమకు తెలిసిందని పేర్కొంది. పెళ్లి ప్రతిపాదన పూర్తి చేయని ఆ వ్యక్తి, అతడి కుటుంబం తమను మోసగించినట్లు ఆరోపిస్తూ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. 2021లో విచారణ జరిపిన కోర్టు, రాజు కృష్ణ తప్ప మిగతా కుటుంబ సభ్యులపై చీటింగ్ కేసును కొట్టివేసింది.కాగా, రాజు కృష్ణ దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. పెళ్లి ప్రతిపాదనతో మహిళను మోసగించినట్లుగా తనపై నమోదైన కేసును కొట్టివేయాలని అభ్యర్థించాడు. న్యాయమూర్తులు సుధాన్షు ధులియా, ప్రసన్న బీ వరాలేతో కూ డిన ధర్మాసనం అతడి పిటిషన్‌పై విచారణ జరిపింది.

వివాహ ప్రతిపాదన ఆశించిన ముగింపునకు రాకపోవడానికి అనేక కారణాలు ఉండవచ్చని కోర్టు అభిప్రాయపడింది. అయితే మోసం కింద కేసు చేయాలంటే మోసం చేయడం లేదా మోసం చేయాలనే ఉద్దేశం మొదటి నుంచి ఉన్నదా? అన్నది పరిశీలించాలని న్యాయస్థానం పదే పదే పునరుద్ఘాటించినట్లు గుర్తు చేసింది. ఆధారాలు లేన్నందున రాజు కృష్ణపై నమోదైన చీటింగ్ కేసును సుప్రీంకోర్టు రద్దు చేసింది.

# మార్చి 16 నుంచి తరిగొండ లక్ష్మీ
# నృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



**తిరుపతి :** తరిగొండ లక్ష్మీనృసింహస్వామివారి ఆలయంలో మార్చి 16 నుంచి 24వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడ అధికారులు వివరించారు. మార్చి 15న సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్య అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని వెల్లడించారు.బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు వాహనసేవలు నిర్వహిస్తామని తెలిపారు. మార్చి 21న రాత్రి 8 నుంచి 10 గంటల వరకు కల్యాణోత్సవం, 25న పుష్పయాగం 24న ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

తిరుమలలో 63,421 మంది దర్శనంతిరుమల భక్తుల రద్దీ కొనసాగుతుంది. నిన్న స్వామివారిని 63,421 మంది భక్తులు దర్శించుకోగా 19,644 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 4.84 ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు.

# ప్రత్యేక విమానంలో గుండె తరలింపు..
## తిరుపతిలో చికిత్స విజయవంతం




**తిరుపతి :** అవయవదానం వల్ల మరొకరి జీవితం ప్రసాదించవచ్చని నిరూపించారు తిరుపతి లోని శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం వైద్యులు. ఈ సందర్భంగా వైద్యులు 12వ గుండె మార్పిడి శస్త్ర చికిత్సను ఆసుపత్రిలో విజయవంతం చేయడంతో టీటీడీ ఈవో ధర్మారెడ్డి వైద్యులకు అభినందనలు తెలిపారు.శ్రీకాకుళం జిల్లా రాజోలుకు చెందిన కె.ధర్మారావు(28) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో అక్కడి జెమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. అయితే, ఆ యువకుడికి బ్రెయిన్ డెడ్ వైద్యులు గుర్తించారు. సదరు యువకుడి అవయవాలను దానం చేసేందుకు తల్లిదండ్రులు అంగీకరించడంతో ఇతర ఆసుపత్రులకు సమాచారం అందించారు.వైజాగ్‌కు చెందిన 42 ఏళ్ల వ్యక్తి డైలేటెట్ కార్డి యోమయోపతి వ్యాధితో గుండె పోటుకు గురయ్యే స్థితిలో తిరుపతిలోని శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాలయంలో చికిత్స పొందుతున్నాడు. అవయవదానం సమాచారం అందు కున్న శ్రీ పద్మావతి హృదయాలయం డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డి వెంటనే ఉన్నతాధికారులను సంప్రదించి గుండె మార్పిడికి ఏర్పాట్లు చేశారు.ఫిబ్రవరి 26న సాయంత్రం 6 గంటలకు వైద్య బృందం గుండెను సేకరించి ప్రత్యేక ఏర్పాట్లతో శ్రీకాకుళం రాజోలు నుంచి గ్రీన్ ఛానల్ ద్వారా రోడ్డు మార్గంలో వైజాగ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి రాత్రి 8 గంటలకు ప్రత్యేక విమానంలో బయల్దేరి రాత్రి 10.05 గంటలకు రేణిగుంట చేరుకున్నారు.

## అధికారంలోకి రాగానే మాట మరిచిన కాంగ్రెస్
# : ఆర్. కృష్ణయ్య



**ముషీరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మాట మారుస్తూ నిరుద్యోగులను మోసం చేస్తుందని బీసీ సంక్షే సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆరోపించారు. మొత్తం 26 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా ఐదువేలు, పదివేల ఉద్యోగాలంటూ మోసపూరిత నాటకానికి తెరలేపుతున్నారని మండిపడ్డారు. బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.విద్యాశాఖలోని కొంత మంది అధికారుల మాటలు నమ్మి ప్రభుత్వం గుడ్డిగా ముందుకు వెళ్తుందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే టెట్ నిర్వహించి, పూర్తి స్థాయిలో టీచర్ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బీసీ నేత ప్రధానిగా ఉండి కూడా వెనకబడిన వర్గాలకు అన్ని రంగాల్లో తీరని అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్ లు, సమాన వాటా కోసం దశాబ్దాలుగా పోరాటం జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం సమస్యను పరిష్క రించకుండా మోసం చేస్తుందని మండిపడ్డారు.అన్ని వర్గాలు ఆరాధించే రాముడిని తమ వాడు అన్నట్లు దేవుడిని రాజకీయాల కోసం వాడుకుంటున్నారని, 60 శాతం బీసీలు పేదరికంలో మగ్గుతుంటే వికసిత భారత్ అంటూ ఊదరగొడుతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు అన్ని రంగాల్లో సమాన వాటా, చట్టసభల్లో, విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్‌లు, కులగణన చేపడతామని అన్ని పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చాలని డిమాండ్ చేశారు.

# పాక్ బీజేపీకి శత్రు దేశం..
# మాకు పొరుగు దేశం
### : కర్నాటక కాంగ్రెస్ నేత వ్యాఖ్యలపై వివాదం



**బెంగళూర్ :** కర్నాటక కాంగ్రెస్ నేత బీకే హరిప్రసాద్ బుధవారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్ బీజేపీకి శత్రుదేశం కావచ్చుని, తమకు కాదని ఆయన స్పష్టం చేశారు. కాషాయ పార్టీకి పాక్ శత్రుదేశమైనా, కాంగ్రెస్ పార్టీ మాత్రం పాక్‌ను పొరుగు దేశంగానే పరిగణిస్తుందని హరిప్రసాద్ పేర్కొన్నారు. కర్నాటక రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం అనంతరం అసెంబ్లీలో పాక్ అనుకూల నినాదాలు చేశారని బీజేపీ ఆరోపించిన నేపథ్యంలో హరిప్రసాద్ ఈ వ్యాఖ్యలు చేశారు.పాకిస్థాన్ శత్రు దేశం అంటున్నారు. లాహోర్‌లోని జిన్నా సమాధిని సందర్శించి, ఆయన వంటి సెక్యులర్ నాయకుడు మరొకరు లేరని చెప్పిన ఎల్‌కె అద్వానీకి ఇటీవల వారు భారతరత్న ప్రదానం చేశారు. అప్పుడు పాకిస్తాన్ శత్రు దేశం కాదా? అని హరిప్రసాద్ శాసనమండలిలో మాట్లాడుతూ కాషాయ పార్టీని నిలదీశారు. కాంగ్రెస్ నేత వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.భారత్‌పై పాక్ నాలుగు సార్లు యుద్ధానికి తలపడినా ఆ దేశాన్ని శత్రు దేశమని కాంగ్రెస్ చెప్పడం లేదని ఆక్షేపించింది. కాంగ్రెస్ పార్టీ జాతి వ్యతిరేక భావాలను కలిగిఉందని ఆరోపించింది. నెహ్రూ-జిన్నా మధ్య సాన్నిహిత్యాన్ని ప్రస్తుత తరం కాంగ్రెస్ కూడా కొనసాగిస్తోందని, పాక్ బీజేపీకి శత్రువు కాంగ్రెస్‌కు పొరుగుదేశమని చెప్పడం దీన్ని స్పష్టం చేస్తోందని బీజేపీ ట్విట్టర్ వేదికగా పేర్కొంది.

# రాజీనామా చేయలేదు
# : హిమాచల్ సీఎం సుఖ్వీందర్



**న్యూఢిల్లీ:** తాను ఎవరికీ రాజీనామాను సమర్పించలేదని హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖుతెలిపారు. తన రాజీనామా గురించి బీజేపీ వదంతులు వ్యాపింప చేస్తున్నదని ఆయన అన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో మంగళవారం రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో అక్కడ కాంగ్రెస్ సర్కార్‌పై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడడంతో.. బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు. దీంతో సుఖ్వీందర్ సర్కార్ ప్రమాదంలో పడింది. సుఖ్వీందర్ రాజీనామా చేశారని బీజేపీ నేత జైరాం ఠాకూర్ ఆరోపించారు. ఈ ఆరోపణలపై సీఎం సుఖ్వీందర్ స్పందించారు. ఎవరు కూడా తన రాజీనామా గురించి ప్రస్తావించలేదన్నారు. తాను ఎవరికీ రాజీనామా సమర్పించలేదన్నారు. తమ మెజార్టీని ప్రూవ్ చేస్తామన్నారు. బడ్జెట్ సెషన్‌లో తాము గెలవనున్నట్లు చెప్పారు.

# వైసీపీకి ఒంగోలు ఎంపీ
# మాగుంట రాజీనామా



**అమరావతి :** ఏపీ వైసీపీలో మరో వికెట్ పడింది. ఆ పార్టీకి చెందిన ఒంగోల్ వైసీపీ పార్ల మెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి రాజీనామా చేశారు. 1998, 200 4, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఒంగోలు ఎంపీ మాగుంట పోటీ చేసి విజయసాధించారు. 2014లో టీడీపీ తరుపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2017లో టీడీపీ ఎమ్మెల్సీగా గెలిచారు.ఈ సందర్భంగా మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ మాగుంట కుటుంబానికి ఆత్మగౌరవం ముఖ్యమని, ఆత్మగౌరవం దక్కని చోట పనిచేయడం వేస్టని భావించి వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కొన్ని అనివార్య కారణాల వల్ల వైసీపీని వీడుతున్నానని చెప్పారు. ఐదు సంవత్సరాల పాటు తనకు సహకరించిన ఏపీ సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన కుమారుడు రాఘవరెడ్డి ఒంగోలు ఎంపీగా పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. అయితే ఆయన ఏ పార్టీలో చేరాతరన్న విషయాన్ని స్పష్టత ఇవ్వలేదు.

## పదేళ్లుగా బీజేపీ మోసం చేస్తూనే ఉంది : వైఎస్ షర్మిల



**అమరావతి :** కేంద్రంలోని బీజేపీ సర్కారు గత పదేండ్లుగా ఏపీ ప్రజలను మోసం చేస్తూనే ఉందని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. ఇచ్చిన హామీలను ఏ ఒక్కటిని నెరవేర్చకపోవడం ప్రజలంతా నిరాశలో ఉన్నారని పేర్కొన్నారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రత్యేక హోదా గురించి వైసీపీ ప్రభుత్వం కేంద్రాన్ని, స్వార్థంతో నిలదీయకపోయిందని విమర్శించారు.ప్రత్యేక హోదా వచ్చిన రాష్ట్రాలకు పరిశ్రమలు వస్తాయని, తద్వారా యువత ఉద్యోగ అవకాశాలు పొందుతారని అన్నారు. ఏపీని హార్డ్ వేర్ హబ్‌గా మారుస్తామని, చమురు రిఫైనరీలు ఇస్తామని ప్రధాని మోదీ ఇచ్చిన హామీని ఆమె గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం మెగా డీఎస్సీ అంటూ దగా చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రత్యేక హోదా, పోలవరం, రాజధాని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలిపివేత లాంటి నిర్ణయాల అమలుకు కాంగ్రెస్ అధికారంలోకి రావాలని అన్నారు. మార్చి 1న తిరుపతిలో జరుగనున్న బహిరంగ సభలో ఏపీకి ప్రత్యేక హోదా డిక్లరేషన్ ఇస్తామని షర్మిల తెలిపారు.

## గుల్మార్గ్ హోటల్‌లో అగ్నిప్రమాదం.. మంచుతో మంటలు ఆర్పేందుకు స్థానికులు యత్నం



**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన గుల్మార్గ్‌లోని ఒక హోటల్‌లో బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. దీంతో స్నో బాల్స్ విసిరి మంటలు ఆర్పేందుకు స్థానికులు ప్రయత్నించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. స్కీయింగ్‌కు ప్రసిద్ధి చెందిన గుల్మార్గ్‌లో జనవరిలో మంచులేక పొడిగా ఉంది. అయితే ఫిబ్రవరి మొదటి వారం నుంచి భారీగా మంచుకురుస్తున్నది.కాగా, బుధవారం ఉదయం గుల్మార్గ్‌లోని ఒక రిసార్ట్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. మంటలు భారీగా ఎగసిపడ్డాయి.

ఇది చూసి స్థానికులు భయాందోళన చెందారు. అయితే మంచు ముద్దలు విసిరి మంటలు ఆర్పేందుకు కొందరు ప్రయత్నించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.మరోవైపు గత వారం గుల్మార్గ్‌లో భారీ హిమపాతం సంభవించింది. రష్యాకు చెందిన ఏడుగురు స్కీయర్లు హిమపాతంలో చిక్కుకున్నారు. రెస్క్యూ సిబ్బంది ఆరుగురిని రక్షించగా, రష్యాకు చెందిన ఒక స్కీయర్ మరణించాడు.

## చర్మం అందంగా మెరిసిపోవాలా.. ఇదిగో ఆయుర్వేదంలోని ఉత్తమ ఉపాయాలు!



**న్యూఢిల్లీ :** వేసవి అయినా, చలికాలమైనా.. పొడిబారిన చర్మమైనా, జిడ్డోడే మేను అయినా.. చర్మం ఆరోగ్యంగా ఉండాలనే అం దరూ కోరుకుంటారు. అందుకు ఆయు ేర్వద ంలో ఉత్తమ ఉపా యాలు న్నాయి. దాడిమా దిఘృతం: దాడిమి అంటే దానిమ్మ. ఘృతం అంటే నెయ్యి. ఆవునెయ్యి, దానిమ్మ గింజలతో చేసే ఈ ఔషధాన్ని సేవిస్తే కనుక.. అందులోని విటమిన్లు, యాంటీఆక్సిడెంట్ల వల్ల చర్మం మృదువుగా మారుతుంది.ఆయుర్వేద టీ: తులసి, వేప, ఉసిరి, పసుపులాంటి ఔషధ వనరుల మిశ్రమంతో చేసిన పొడిని మరిగించి వడగట్టాలి. ఆ తేనీరు తీసుకుంటే చర్మం కాంతిమంతం అవుతుంది.ఫేస్ మాస్క్: మందార, గులాబీ, చందనం,

మంజిష్ట, పసుపు, కుంకుమ పువ్వు.. లాంటి పదార్థాలతో తయారు చేసుకునే ఫేస్‌మాస్క్ వల్ల రక్తప్రసరణ మెరుగుపడి, చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.కుంకుమ పువ్వు: ఇందులోని యాంటీఆక్సిడెంట్స్ చర్మం యవ్వనంగా ఉండేందుకు సాయపడితే, కెరోటినాయిడ్స్ ఒంటి మీది మచ్చలు తొలగించి చర్మపు కాంతి పెరిగేలా చేస్తాయి.

## మరో వ్యక్తితో స్నేహం చేస్తోందన్న అనుమానంతో భార్యను చంపిన భర్త.. ఆపై ఆత్మహత్యాయత్నం




**జైపూర్:** మరో వ్యక్తితో స్నేహం చేస్తోందన్న అనుమానంతో భార్యపై భర్త ఆగ్రహించాడు. గొడ్డలితో నరికి ఆమెను హత్య చేశాడు. ఆపై మంటల్లో దూకి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు రక్షించడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాజస్థాన్‌లోని బన్స్వారా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పూనియా ఖేడా గ్రామానికి చెందిన 32 ఏళ్ల రాజు తన భార్య అయిన 30 ఏళ్ల నానికి మరో వ్యక్తితో స్నేహం ఉందని అనుమానించాడు. మంగళవారం తెల్లవారుజామున గొడ్డలితో నరికి భార్యను హత్య చేశాడు. ఆ తర్వాత ఎండు గట్టికి నిప్పంటించి అందులోకి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించాడు.కాగా, గమనించిన స్థానికులు మంటల్లో దూకిన రాజును కాపాడారు. ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు మహిళ హత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గార్డన్ రామ్సే బటర్ చికెన్ రెసిపీపై దేశీ నెటిజన్ల ఫైర్



**న్యూఢిల్లీ :** పాక ప్రపంచంలో సెలబ్రిటీ చెఫ్‌గా పేరొంది, పలు వంటలను నిశితంగా పరిశీలిస్తూ విమర్శలు చేయడంలో చేయితిరిగిన గార్డన్ రామ్సే ప్రసిద్ధ ఇండియన్ డిష్ తయారుచేశారు. రామ్సే దేశీ ఫుడ్‌పై నెటిజన్లు పెదవివిరిచారు. ఫేవరెట్ ఇండియన్ డిష్ బటర్ చికెన్ తయారుచేసే వీడియోను రామ్సే ఇన్‌స్టాగ్రాంలో షేర్ చేశారు.ఈ వంటకంపై సోషల్ మీడియా వేదికగా దేశీ ఫుడ్ లవర్స్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వీడియోలో రామ్సే టమాటా సాస్‌తో బటర్ చికెన్‌ను తయారుచేయడం కనిపిస్తుంది. బటర్ చికెన్ రెసిపీల్లో చికెన్ సాస్ వాడటం అరుదు కావడంతో ఈ ప్రయోగం నెటిజన్లకు అంతగా నచ్చలేదు.ఈ వీడియోకు లక్షల్లో వ్యూస్ దక్కినా ఈ డిష్‌లో ఊహించని పదార్థాలను జోడించడం దేశీ నెటిజన్లను నిరాశపరిచింది. అసలు టమాటా సాస్, నిమ్మకాయ ఈ రెసిపీకి ప్రామాణికమైన రుచిని ఎలా ఇస్తాయని పలువురు యూజర్లు ప్రశ్నించారు.

# సంతానలేమి సమస్యలకు థైరాయిడ్‌తో సంబంధం ఉందా ?

**హైదరాబాద్:**ఇటీవల చాలామందిలో థైరాయిడ్ సమస్య కనిపిస్తున్నది. ప్రత్యేకించి, హైపో థైరాయిడిజం గురించి నాకో సందేహం ఉంది. సెక్స్ పట్ల అయిష్టత, సంతాన సాఫల్య సమస్యకు ఈ రుగ్మతతో ఏమైనా సంబంధం ఉందా? నేను కూడా హైపో థైరాయిడిజంతో బాధపడుతున్నా. ఓ పరిష్కారం చెప్పండి ప్లీజ్.పాఠకురాలుథైరాయిడ్ గ్రంథి అనేది సంతానలేమి విషయంలో చాలా పెద్ద పాత్ర పోషిస్తుంది. దానికి వెంటనే చికిత్స అందించాలి. ఇలాంటి వాళ్లు గర్భం ధరించినప్పుడు మొదటి మూడు నెలల్లో గర్భస్థ పిండం థైరాయిడ్‌ను తయారు చేసుకోలేదు. అలాంటి సమయంలో తల్లికి థైరాయిడ్ డోస్ ఎక్కువ ఇస్తాం. ఎందుకంటే ఇది తల్లి నుంచి బిడ్డకు వెళ్లాలి. న్యూరలాజికల్ డెవలప్‌మెంట్.. అంటే మెదడు, నాడీ వ్యవస్థలాంటివి తయారయ్యేందుకు కూడా థైరాయిడ్ చాలా ముఖ్యం. థైరాయిడ్ సమస్య వల్ల సమయానికి అండం విడుదల కాదు. సక్రమంగా నెలసరి రాదు. థైరాయిడ్ గ్రంథి పనిచేయకపోతే ఈస్ట్రోజెన్ హార్మోన్ ఎక్కువ అవుతుంది. ఫలితంగా, నెలసరిలో అధిక రక్తస్రావం అవుతుంది. సంతాన సమస్యలు ఏర్పడతాయి.నెలసరి ఎగుడు దిగుడుల వల్ల చాలామంది దీన్ని పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్ (పీసీఓఎస్)గా పొరబడతారు. అలాంటి అనుమానం వచ్చినప్పుడు థైరాయిడ్ టెస్ట్ చేయించుకోవాలి. అలా అని, ఇది కంగారు పడాల్సిన విషయం ఏమీ కాదు. కాలుష్యం వల్ల శరీరంలో అయోడిన్ తక్కువైనా ఇలా జరుగుతుంది. థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తికి అయోడిన్



చాలా ముఖ్యం. అందుకే అయోడైజ్డ్ ఉప్పును సూచిస్తుంటాం.

# డయాబెటిస్‌కు, దంతాలకు సంబంధమేంటి? చిగుళ్ల సమస్యలకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి!

**హైదరాబాద్:**ఏ సమస్య వచ్చినా వైద్యులు ముందుగా నోటినే పరిశీలిస్తారు. నోటి ఆరోగ్యంలో దంతాలదే కీలకపాత్ర. దంతాలు అనా రోగ్యానికి గురైతే, శరీరంలోని ఇతర భాగాలూ దెబ్బతింటాయి. అందులోనూ, దంతాలపై మధుమేహం తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు మధుమేహానికి, దంతాలకు ఉన్న సంబంధం ఏమిటి? డయాబెటిస్ వల్ల ఎలాంటి దంత సమస్యలు వస్తాయి? ఈ విషయంలో మధుమేహ రోగులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? .తదితర అంశాల గురించి ఇప్పుడు తెలు సుకు ందాం..మధుమేహానికి, దంతాల ఆరోగ్యానికి ప్రత్యక్ష సంబంధం ఉంది. మధుమేహం అంటే రోగి రక్తంలో చక్కెర స్థాయులు అధికంగా ఉండటం. ఇది రెండు రకాలు. మొదటిది.. టైప్-1 డయాబెటిస్. రెండోది.. టైప్-2 డయాబెటిస్. ఎక్కువమందిలో కనిపించేది రెండో రకమే. గర్భిణులలోనూ కొన్నిసార్లు హార్మోన్ మార్పుల వల్ల చక్కెర నిల్వలు పెరిగే అవకాశం ఉంది. కానీ కొద్దిరోజులకే నియంత్రణలోకి వస్తుంది.

టైప్-1ఈ తరహా మధుమేహ రోగుల్లో జన్యుపరంగానే ఇన్సులిన్ ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. డయాబెటిస్‌తో బాధపడే బాలల్లో అయితే.. 20 ఏండ్ల లోపే దంతాలు ఊడిపోవడం మొదలవుతుంది. కనీసం నాలుగు మూల దంతాలు ఊడిపోతే.. దాన్ని టైప్-1 డయాబెటిస్‌గా పరిగణిస్తారు వైద్యులు.టైప్-2ఈ రోగుల్లో ఇన్సులిన్ ఉత్పత్తి జరిగినా, షుగర్‌ను నియంత్రించేంత స్థాయిలో ఉండదు. టైప్-1, టైప్-2.. రెండు మధుమేహం రకాలూ దంతాలపై ఒకేలా ప్రభావం చూపుతాయి. ఒకేరకమైన ఇబ్బందిని కలిగిస్తాయి.

జెస్టేషనల్ డయాబెటిస్గర్భిణులలో హార్మోన్ మార్పుల వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం లేకపోలేదు. అయితే, ప్రసవం తరువాత 90 శాతం మందిలో షుగర్ మళ్లీ సాధారణ స్థితికి చేరుకుంటుంది. మధుమేహం తీవ్రంగా ఉన్న సమయంలో సాధారణ రోగుల్లో కనిపించే చిగుళ్లు, దంతాల సమస్యలే.. గర్భిణులనూ ఇబ్బంది పెడతాయి. కాబోయే తల్లి తల్లడిల్లిపోయేలా చేస్తాయి.తీయని శత్రువుమధుమేహ పీడితులలో రోగనిరోధక శక్తి గణనీయంగా పడిపోతుంది. హానికర బ్యాక్టీరియాతో పోరాడే సత్తువ సన్నగిల్లుతుంది. ఫలితంగా ఆ బ్యాక్టీరియా నోటిపై ప్రభావం చూపుతుంది. గాయాలు ఓ పట్టాన మానిపోవు. అక్కడితో ఆగకుండా, ఆ బ్యాక్టీరియా కక్షగట్టినట్టు షుగర్ స్థాయులను పెంచుతుంది. దీనివల్ల నోటి ఇన్ఫెక్షన్లు అధికమవుతాయి. అంటే.. నోటిలో ఇన్ఫెక్షన్లు పెరిగితే మధుమేహ తీవ్రత పెరుగుతుంది. మధుమేహ తీవ్రత పెరిగితే నోటిలో ఇన్ఫెక్షన్లు కూడా పెరుగుతాయి. ఈ బంధానికి అడ్డుకట్ట వేయాలి.దంతాల అంతుచూస్తూ..డయాబెటిస్ రోగులను ప్రధానంగా ఆరురకాల దంత సమస్యలు వేధిస్తాయి. 1. పిప్పిపళ్లు, 2. చిగుళ్ల సమస్య, 3. పెరియో డాంటైటిస్, 4. క్రష్, 5. డ్రై మౌత్, 6. నోటి దుర్వాసన.

1. పిప్పిపళ్లుమనం తీసుకునే ఆహారంలో ఉన్న చక్కెర, పిండి పదార్థాలకు నోటిలోని బ్యాక్టీరియా వేగంగా స్పందిస్తుంది. దీని వల్ల దంతాలపై సన్నని గార ఏర్పడుతుంది. దీనిలోని రసాయనాలు పంటి పైభాగంలోని ఎనామిల్‌ను, డెంటిన్‌ను



దెబ్బతిస్తాయి. దీనివల్ల పిప్పిపళ్లు పుట్టుకొస్తాయి. బ్లడ్ షుగర్ ఎంత పెరిగితే అంత ఎక్కువగా గార పేరుకుపోతుంది. రసాయనాల దాడి అధికమవుతుంది. నోరంతా పిప్పి విస్తరించవచ్చు.2. చిగుళ్ల వ్యాధులువ్యాధి నిరోధక శక్తి తగ్గడంతో హానికర బ్యాక్టీరియా ప్రాబల్యం పెరుగుతుంది. దీనివల్ల గార మరింత గట్టిపడుతుంది. క్రిమి కీటకాలకు చిరునామాగా మారుతుంది. అంతేకాకుండా.. చిగుళ్లనూ దెబ్బతీస్తుంది. దీంతో చిగుళ్లు ఉబ్బడం, రక్తం కారడం తదితర ఇబ్బందులు తలెత్తుతాయి. ఈ సమస్యను 'జింజివైటిస్' అంటారు. దీన్ని చిగుళ్ల వ్యాధికి మొదటి దశగా పరిగణిస్తారు.

3. పెరియోడాంటైటిస్జింజివైటిస్‌కు సకాలంలో చికిత్స చేయకపోతే.. పంటికింది ఎముకను క్రమంగా తినేయడం మొదలుపెడుతుంది. దీంతో పన్ను వదులైపోతుంది. ఓ దశలో ఊడిపోతుంది. దీన్నే వైద్య పరిభాషలో 'పెరియోడాంటైటిస్' అంటారు. ఈ సమస్య సాధారణ వ్యక్తులలో కంటే డయాబెటిక్ రోగుల్లో మూడురెట్లు అధికం. డయాబెటిక్ రోగుల్లో ఇట్టే దంతాలు కదులుతాయి. అంతే కాకుండా చిగుళ్ల వాపు, చిగుళ్ల నుంచి చీము రావడం తదితర ఇబ్బందులూ వెంటాడతాయి.4. క్రష్ నాలుకపై ఫంగల్ ఇన్ఫెక్షన్ రావడాన్నే 'క్రష్' అంటారు. ఈ ప్రభావంతో నాలుకపై తెలుపు లేదా ఎరుపు రంగు మచ్చలాంటిది ఏర్పడుతుంది. ఇది కొంతమేర నొప్పిని కలిగిస్తుంది. డయాబెటిస్ రోగుల్లో ఈ సమస్య మరీ అధికం.5. డ్రై మౌత్‌నోట్లో లాలాజలం తగ్గినప్పుడు నోరు పొడిబారుతుంది. దీన్నే 'డ్రై మౌత్' అంటారు. లాలాజలం ఎప్పటికప్పుడు నోటిని శుభ్రపరుస్తుంది. రసాయనాలు మరీ పెరిగిపోకుండా, మరీ తగ్గిపోకుండా సమతౌల్యం చేస్తుంది. లాలాజలం తగ్గడం వల్ల రసాయన స్థాయులు అధికమై నోరు అపరిశుభ్రంగా మారుతుంది. దీంతో పిప్పిపళ్లు తదితర సమస్యలు వెంటాడుతాయి.6. నోటి దుర్వాసననోటి దుర్వాసన వేధిస్తుంది. కాబట్టి మధుమేహం విషయంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటారో, దంత సమస్యల విషయం లోనూ అన్ని వైద్యపరమైన చర్యలు తీసుకోవాలి.

1. మధుమేహం నియంత్రణలో ఉండేలా చూసుకోవాలి.2. రోజుకు రెండుసార్లు బ్రష్ చేయాలి (ఉదయం లేవగానే, రాత్రి పడుకునే ముందు). రాత్రి బ్రష్ చేసిన తరువాత ఎలాంటి ఆహారమూ తీసుకోరాదు.3. సున్నితంగా ఉండే బ్రష్‌లనే ఎంచుకోవాలి.4. మరీ బలంగా రుద్దినట్టు కాకుండా, ఒక పద్ధతి ప్రకారం తోముకోవాలి.5. కనీసం రెండు నిమిషాలపాటు బ్రష్ చేయాలి.6. మూడు నెలలకు ఒకసారి బ్రష్ మార్చాలి.7. అవసరమైతే, రోజు ఫ్లాసింగ్ చేయాలి (పళ్ల మధ్య దారంతో శుభ్రం చేసుకునే పద్ధతి).

8. ప్రతి ఆరు నెలలకు ఒకసారి దంత పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం.9. సాధారణ ఆరోగ్యవంతులు ఏడాదికోసారి నిపుణులతో దంతాలను శుభ్రం చేయించుకోవాలి.10. డయాబెటిస్ ఉన్నవారు ఆ విషయాన్ని దంత వైద్యులకు తప్పక చెప్పాలి.11. నోటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, వెంటనే వైద్యులను సంప్రదించాలి.12. ధూమపానం కూడా దంతాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. కాబట్టి, ఆ అలవాటును వదిలించుకోవాలి.మౌత్‌వాష్ మంచిదేఏదైనా తిన్న తర్వాత మంచినీళ్లతో పుక్కిలించి ఉమ్మడం మంచి అలవాటు. దీనికితోడు.. ముడి ఉప్పును గోరువెచ్చని నీటిలో కలిపి రోజూ నోటిని శుభ్రపర్చు కోవాలి. దీనివల్ల ఇన్ఫెక్షన్లు కొంతమేర నియంత్రణలో ఉంటాయి. వైద్యుల సలహాతో మార్కెట్‌లో లభించే నాణ్యమైన మౌత్‌వాష్‌లనూ వాడవచ్చు. రసాయనాల ప్రభావం లేనివైతే మరీ మంచిది. దీనివల్ల సగానికి సగం హానికర బ్యాక్టీరియాను తొలిదశలోనే వదిలించుకోవచ్చు.

# ఢిల్లీ మహిళకు హైదరాబాద్‌లో విజయవంతంగా మూలకణ చికిత్స

**హైదరాబాద్ :** ఆరు నెలల క్రితం వరకు తీవ్రమైన మోకాలునొప్పితో బాధపడుతు ఉండేవారు. 67 ఏండ్ల మీనాక్షి సెహగల్. ఎడమ మోకాలు వద్ద ఆర్థరైటిస్ కారణంగా అడుగుతీసి అడుగు వేయలేకపోయేవారు. అలాంటి పరిస్థితిని కొన్ని సంవత్సరాల పాటు అనుభవించారు. చివరకు హైదరాబాద్‌లో ఆమెకు అద్భుతమైన చికిత్స లభించింది. రీజెన్ ఆర్థోస్పోర్ట్ క్లినిక్‌కు చెందిన డాక్టర్ వెంకటేశ్ మొవ్వా ఆమెకు ఈ చికిత్స చేశారు. ఆ తర్వాత.. ఇప్పుడు సముద్రమట్టానికి 14వేల అడుగుల ఎత్తున ఉన్న కొండలు కూడా ఎక్కేస్తున్నారు!! తన సమస్య ఏంటో, దానికి పరిష్కారం ఎలా లభించిందో నోయిడాకు చెందిన మీనాక్షి సెహగల్ నమస్తే తెలంగాణకు వివరించారు.ఇక్కడకు రావడానికి ముందుగా నేను ఒకసారి డాక్టర్ వెంకటేశ్ మొవ్వాతో ఫోన్‌లో మాట్లాడాను. అప్పుడే ఆయన ఈ చికిత్స గురించి చెప్పారు. హైదరాబాద్ వచ్చి ఆయనను కలిశాను. ఆ కన్సల్టేషన్ నా జీవితంలో గణనీయమైన మార్పులకు కారణమైంది. మొదట క్లినిక్‌లో మూడు రోజుల చికిత్స మొదలైంది. ఆ తర్వాత మూడు నుంచి నాలుగు వారాల పాటు పూర్తిస్థాయి చికిత్స, వ్యాయామాలు, తీసుకోవాల్సిన ఆహారం..

వీటన్నింటినీ నిపుణులైన ఫిజియోథెరపిస్టు వివరించారు. నాకు కొంత మార్పు కనిపించింది. మూడు నెలల తర్వాత మొదటి బూస్టర్ డోసు ఇచ్చారు. అది తీసుకున్నాక నార్వే అడవులు, నిటారు కొండలు, నిలువెత్తు గుట్టలు.. ఇలా గతంలో ఎప్పుడూ కనీసం ఆలోచన కూడా చేయలేని ప్రదేశాలకు వెళ్లగలిగాను.రెండో బూస్టర్ డోసు తీసుకున్నాక నేను పెరూ దేశానికి వెళ్లాను. అక్కడ మచు పిచ్చు, కజ్కో, పునో, ఐకా లాంటి ప్రదేశాలకు వెళ్లాను. ఇవన్నీ సముద్రమట్టానికి 12,500 నుంచి 14వేల అడుగుల ఎత్తున ఉంటాయి. నా మోకాలినొప్పి 95% తగ్గిపోయింది. దీనివల్ల నాకు జీవితంలో సరికొత్త స్వేచ్ఛ, సంతోషం లభించాయి.



నొప్పులు ఉన్నవాళ్లు రీజెన్ ఆర్థోస్పోర్ట్ ఆస్పత్రికి వచ్చి ఇక్కడ మూలకణ చికిత్స తీసుకుంటే ఇక ఆపరేషన్ అవసరం దాదాపుగా ఉండకపోవచ్చు" అని మీనాక్షి సెహగల్ తెలిపారు.కాలినొప్పి తర్వాత కూడా సరికొత్త జీవితం సాధ్యం: డాక్టర్ వెంకటేశ్ మొవ్వా"మీనాక్షి సెహగల్‌కు మోకాలిలోని మినిస్కస్ దెబ్బతింది. దానివల్ల ఆమె ఇబ్బంది పడేవారు.

## ఏఐ అసిస్టెంట్‌తో 700 ఉద్యోగాలు కనుమరుగు
## : ఫిన్‌టెక్ కంపెనీ వెల్లడి




**హైదరాబాద్:** కృత్రిమ మేథ (ఏఐ) రాకతో కంపెనీలు పెద్దసంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తాయనే ఆందోళన నడుమ ఈ ప్రక్రియ ఇప్పటికే మొ దలైందని ఓ స్వీడిష్ ఫైనాన్షియల్ టెక్నాలజీ కంపెనీ బాంబు పేల్చింది. మాస్ లేఆఫ్స్ ప్రకటించిన ఏడాది తర్వాత చావు కబురు చల్లగా చెప్పింది.తమ ఏఐ అసిస్టెంట్‌తో 700 మంది ఉద్యోగులను రీప్లేస్ చేశామని ఫిన్‌టెక్ కంపెనీ క్లార్నా వెల్లడించింది. 700 మంది ఫుల్‌టైం ఉద్యోగుల పనిభారాన్ని తమ ఏఐ అసిస్టెంట్ చక్కదిద్దుతుందని పేర్కొంది. ఏడాది కిందట ఇదే సంఖ్యలో ఉద్యోగులను తొలగించడంతో కంపెనీ విమర్శలు ఎదుర్కొన్న నేపథ్యంలో ఏడాది తర్వాత ఈ విషయాన్ని క్లార్నా వెల్లడించడం గమనార్హం.మాస్ లేఆఫ్స్ సందర్భంగా ఆర్ధిక అనిశ్చితి వాతావరణం, ద్రవ్యోల్బణం వంటి కారణాలతో ఉద్యోగులను తొలగించాల్సి వచ్చిందని అప్పట్లో క్లార్నా సీఈవో సెబాస్టియన్ సీమియతోవ్‌స్కీ చెప్పుకొచ్చారు. అయితే ఆ పరిస్ధితిని సీఈవో ఎదుర్కొన్న తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. వేటుకు గురైన పలువురు ఉద్యోగుల పేర్లతో కూడిన జాబితాను ఆయన లింక్డిన్‌లో షేర్ చేయడం కలకలం రేపింది. అయితే గతంలో ఉద్యోగులను తొలగించిన దానితో ఏఐ అసిస్టెంట్ సామర్ధ్యానికి సంబంధం లేదని క్లార్నా వివరణ ఇచ్చింది.

## 25 ఏండ్ల తర్వాత హైదరాబాద్
## మైక్రోసాఫ్ట్ ఆఫీసుకు బిల్ గేట్స్




**హైదరాబాద్ :** సరిగ్గా 25 ఏండ్ల క్రితం 1998లో తాను ప్రారంభించిన హైదరా బాద్ లోని మైక్రోసాఫ్ట్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్(ఐడీసీ)ని సంస్థ అధినేత బిల్ గేట్స్ బుధ వారం ఉదయం సందర్శించారు. ప్రస్తుతం మైక్రోసాఫ్ట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో ఐడ సీ కీలక పాత్ర పోషిస్తోంది. అజూర్, విండోస్, ఆఫీస్, బింగ్, కోపిలాట్, ఇతర ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) టూల్స్ అభివృద్ధి వెనుక ఐడీసీ కీ రోల్ ప్లే చేసింది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ డివైజ్‌ల కోసం మైక్రోసాఫ్ట్ 365(మొబైల్) అప్లికేషన్లను తయారు చేయడంలో ఎంతో సహకారం అందించింది.బిల్ గేట్స్ పర్యటన సందర్భంగా ఐడీసీ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఏఐ, క్లౌడ్, గేమింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో మైక్రోసాఫ్ట్ ఆవిష్కరణలకు ఐడీసీ కేంద్రం కానుందని తెలిపారు. ఐడీసీలో ఇంజినీర్లను ఉద్దేశించి బిల్ గేట్స్ చేసిన ప్రసంగం గొప్పదన్నారు. ఏఐ పవర్డ్ ఇండియాపై బిల్ గేట్స్ మరోసారి ఆశాభావం వ్యక్తం చేశారని పేర్కొన్నారు.గతేడాది డిసెంబర్ 5వ తేదీన మైక్రోసాఫ్ట్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ 25 సంవత్సరాలను పూర్తి చేసుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ క్రికెటర్ కపిల్ దేవ్ వచ్చారు.

## కొనసాగుతున్న లేఆఫ్స్
## : 350 మంది ఉద్యోగులపై డేటింగ్ యాప్ వేటు



**న్యూఢిల్లీ :** లేఆఫ్స్ తగ్గుముఖం పట్టి కొత్త ఏడాది కొలువుల కళ ఉంటుందని ఆశించిన వారికి నిరాశ ఎదరువుతోంది. దిగ్గజ కంపెనీల నుంచి స్టార్టప్‌ల వరకూ ఆర్ధిక మందగమనం, వ్యయ నియంత్రణ చర్యలు, పునర్వ్యవస్ధీకరణ వంటి పేర్లతో ఉద్యోగులపై వేటు వేస్తున్నాయి. లేటెస్ట్‌గా ప్రముఖ డేటింగ్ యాప్ బంబుల్ 350 మంది ఉద్యోగులను తొలగించనున్నట్టు బాంబు పేల్చింది.

రాబడి లేకపోవడంతో ఖర్చులకు కళ్లెం వేసే క్రమంలో కొలువుల కోత అనివార్యమని కంపెనీ పేర్కొంది. ఉద్యోగులను తొలగించనున్నట్టు బంబుల్ వెల్లడించడంతో కంపెనీ షేర్ ధరలు ఏకంగా ఏడు శాతంపైగా నష్టపోయాయి.మ్యాచ్ గ్రూప్ నుంచి బంబుల్ తీవ్ర పోటీ ఎదుర్కొంటోంది. తమ యాప్స్‌ను యువత వాడేందుకు బంబుల్ ప్రత్యర్ధులతో దీటైన పోటీ ఎదుర్కొంటోంది. ఇక టారిఫ్‌లు పెరగడంతో ప్రజలు ఖర్చు చేసేందుకు తటపటాయించడం కూడా కంపెనీని ఆర్ధిక కష్టాల్లోకి నెట్టింది. గడ్డుపరిస్ధితుల నేపథ్యంలో ఉద్యోగులను తగ్గించక తప్పని పరిస్ధితి బంబుల్ సీఈవో లిడియన్ జోన్స్‌కు ఎదురైంది.

## మార్కెట్‌లోకి సరికొత్త పల్సర్



**పుణె :** ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ బజాజ్ ఆటో..దేశీయ మార్కెట్లోకి నయా పల్సర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 2024 ఎడిషన్‌గా విడుదల చేసిన ఈ పల్సర్ ఎన్ఎస్ సిరీస్ బైకులను తీసుకొచ్చింది. పల్సర్ ఎన్ఎస్ 2024 సిరీస్, ఎన్ఎస్200, ఎన్ఎస్160, ఎన్ఎస్ 125 మూడు రకాల్లో లభించనున్న ఈ బైకులు రూ.1,57,427, రూ.1,45,792, రూ.1,04,922 ధరను నిర్ణయించింది.నూతన డిజిటల్ కన్సోలెస్ అండ్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్‌తో తీర్చిదిద్దింది. పాత మాడల్‌తో పోలిస్తే ఈ నయా మాడల్‌ను సెమీ-డిజిటల్, బ్లూటూత్ కనెక్టివిటీ, ఇన్‌కమింగ్ కాల్స్, ఎస్ఎంఎస్ అలర్ట్, ఫోన్ బ్యాటరీ సామర్థ్యం, సిగ్నల్ లెవల్, నావిగేషన్ కూడా తెలుసుకోవచ్చును. 150 సీసీ సామర్థ్యంతో రూపొందించిన ఈ బైకుల విక్రయాల్లో ఈ బైకు అత్యధికంగా నమోదవుతున్నది.

## వొడాఫోన్ ఐడియా భారీ నిధుల సమీకరణ



**న్యూఢిల్లీ :** ప్రస్తుతం అందిస్తున్న 4జీ సర్వీసుల్ని పటిష్టప ర్చుకో వడం తోపాటు ఇప్పటికే జాప్యం జరిగిన 5జీ సర్వీసులకు ప్రారంభించడానికి అవసరమైన భారీ నిధుల్ని సమీకరించడానికి వొడాఫోన్ ఐడియా సిద్ధమయ్యింది. మంగళవారం సమావేశమైన కంపెనీ బోర్డు ప్రమోటర్లు, ఇతర ఇన్వెస్టర్లకు ఈక్విటీ షేర్లను జారీచేసి రూ. 20,000 కోట్లను సమీకరించాలన్న ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ప్రత్యర్ధి కంపెనీలు జియో, భారతి ఎయిర్‌టెల్‌లు ఆఫర్ చేస్తున్న సర్వీసులకు ధీటుగా అందించడానికి మొత్తం ఈక్విటీ, డెట్ రూపంలో కలిపి రూ. 45,000 కోట్లు సేకరించాలని బోర్డు నిర్ణయించింది.వొడాఫోన్ ఐడియాలో కేంద్ర ప్రభుత్వానికి 33 శాతం ఈక్విటీ వాటా ఉన్న సంగతి తెలిసిందే. త్రైమాసిక నష్టాలను తెచ్చుకుంటూ, ఏ నెలకు
ఆ నెల చందాదారులను కోల్పోతూ రూ.2.1 లక్షల కోట్ల రుణభారంతో సతమతమవుతున్న వొడాఫోన్ ఐడియా భారీ నిధుల సమీకరణ లక్ష్యాన్ని పెట్టుకోక తప్పలేదు. అయితే ప్రమోటర్లు ఎంత ఈక్విటీని పెట్టుబడి చేస్తారన్నది కంపెనీ వెల్లడించలేదు. డిసెంబర్ చివరినాటికి ఈ కంపెనీ చందాదారుల సంఖ్య 22.30 కోట్లకు తగ్గింది.

# అధిక పెన్షన్ కల భగ్నం?

**న్యూఢిల్లీ :** అధిక పెన్షన్ ఆశిస్తున్న ఉద్యోగులకు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) గట్టి షాక్ ఇచ్చేలా నిబంధనల్లో మార్పు చేసున్నదన్న వార్తలు తాజాగా వెలువడుతున్నాయి. నిర్దేశిత పరిమితికి మించిన జీతంపై పీఎఫ్ చెల్లించే ఈపీఎస్-95 సభ్యులకు అధిక పెన్షన్‌ను వర్తింపచేయాలంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి సంవత్సరంన్నర కావొస్తున్నా, ఈపీఎఫ్‌వో అనేక ఆప్షన్స్‌ను అప్పుడప్పుడూ ప్రకటిస్తూ తాత్సారం చేసింది.అన్ని తతంగాల్ని పూర్తిచేసినట్టుగా ఈ జనవరి తొలినాళ్లలోనే సంస్థ సంకేతాలివ్వడంతో అధిక పెన్షన్ కల ఇక నెరవేరుతుందన్న తరుణంలో పెన్షన్ కాలిక్యులేషన్‌కు కొత్త విధానాన్ని తెస్తున్నట్లు వార్త. ఇందుకు సంబంధించి ఈపీఎఫ్‌వో ఎటువంటి సర్క్యులర్‌నూ జారీచేయనప్పటికీ, వివిధ ప్రాంతాల్లోని తమ కార్యాలయాలకు కొత్త క్యాలిక్యులేషన్ విధానాన్ని తెలియపర్చినట్టు సమాచారం. తాజా రూల్ ప్రకారం ప్రొరాటా ప్రాతిపదికన పెన్షన్ ఎంత ఇవ్వాలన్నది నిర్ణయిస్తారు. దీంతో అధిక పెన్షన్‌కు అర్హులైనవారికి వచ్చే పెన్షన్ 30 శాతం నుంచి 40 శాతం వరకూ తగ్గుతుందని అంచనా.సర్వీసు కాలం రెండు భాగాలుగా విభజనవివిధ ప్రాంతాల్లోని కార్యలయాలకు ఈపీఎఫ్‌వో నుంచి వచ్చిన సమాచారం ప్రకారం అధిక పెన్షన్ కోరుకుంటున్న ఉద్యోగి సర్వీసు కాలాన్ని రెండు భాగాలుగా విభజిస్తారని ఎకనామిక్ లా ప్రాక్టీస్ సంస్థలోని లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రాక్టీస్ హెడ్ పీవీ మూర్తి చెప్పారు. కొత్తగా



విడుదల చేసినట్టు చెపుతున్న విధానం కింద వీరి సర్వీసు కాలాన్ని రెండు భాగాలుగా విభజించి, సగటు పెన్షన్‌బుల్ సేలరీని లెక్కిస్తారు. ఈపీఎస్-95 అమలులోకి వచ్చిన తేదీ 16.11.95 నుంచి 31.08.2014 వరకూ తొలిభాగంకాగా, 01.0 9.2014 నుంచి రిటైర్ అయ్యేంతవరకూ రెండో భాగంగా చూస్తారని మూర్తి వివరించారు.ప్రథమ భాగంలోని చివరి 60 నెలల సగటు జీతాన్ని పెన్షన్ లెక్కింపునకు పరిగణనలోకి తీసుకుంటారు. ద్వితీయ భాగంలో చివరి 60 నెలల సగటు జీతం లేదా 01.09.2014 నుంచి పదవీ విరమణ చేసిన తేదీ (31.08.2019లోపు రిటైర్‌మెంట్)వరకూ సగటు నెల జీతాన్ని లెక్కలోకి తీసుకుంటారు. దీని ప్రకారం ప్రొరాటాగా రెండు భాగాలుగా పెన్షన్ విభజించి చెల్లిస్తారు. అయితే ఈ ప్రొరాటా పెన్షన్ గణనను ఈపీఎఫ్‌వో అధికారికంగా ధృవీకరించలేదని, దానిని వివరించే సర్క్యులర్ ఏదీ జారీకాలేదని లా ప్రాక్టీసింగ్ సంస్థ కరంజవాలా అండ్ కో పార్టనర్ మన్‌మీత్ కౌర్ తెలిపారు.ఎందుకు తగ్గుతుంది?ప్రొరాటా ప్రాతిపదికన కొత్త క్యాలిక్యులేషన్ రూల్ ప్రకారం అర్హులైనవారికి వచ్చే పెన్షన్ గణనీయంగా తగ్గనుంది. ఎందుకంటే 2014 సెప్టెంబర్‌కు ముందు కాలంలో వేతనాలు ఇప్పటితో పోలిస్తే బాగా తక్కువ. అంటే తొలిభాగం 60 నెలల సగటు జీతానికి తగినట్టు అప్పటి పెనన్‌ను గణిస్తారు. మలిభాగం సగటుతో మరో పెన్షన్‌ను గణించి, రెండింటి సగటుతో తుది పెన్షన్ లెక్కింపు జరుగు తుంది. దీంతో మొత్తంగా వచ్చే పెన్షన్ తగ్గిపోతుంది.ఈపీఎఫ్‌వో ఇప్పటికే ప్రకటించిన విధానం ప్రకారం సర్వీసులో చివరి 60 రోజుల సగటు వేతనం ఆధారంగానే పెన్షన్ లెక్కింపు జరుగుతుంది. కానీ ఈపీఎఫ్‌వో కొత్త విధానాన్ని అవలంబిస్తే 30 శాతం నుంచి 40 శాతం తగ్గుతుందని, ఇది సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తికి విరుద్ధమని పీవీ మూర్తి చెప్పారు. ఈపీఎఫ్‌వో పెన్షన్ కాలిక్యులేషన్ రూల్ మార్చడం ద్వారా పెన్షన్ చెల్లింపు మొత్తాన్ని తగ్గించాలన్న లక్ష్యమే కన్పిస్తున్నదన్నారు. ఈ కొత్త మెథడాలజీని ఈపీఎఫ్‌వో నోటీఫై చేసినట్టయితే రిటైరీలు సుప్రీంకోర్టులో సవాలు చేయవచ్చని మన్‌మీత్ కౌర్ సూచించారు.

## యూబీఐతో మారుతి జట్టు ప్రభుత్వరంగ సంస్థ
## యూనియన్ బ్యాంక్‌తో మారుతి సుజుకీ జతకట్టింది.

**న్యూఢిల్లీ :** ప్రభుత్వరంగ సంస్థ యూనియన్ బ్యాంక్‌తో మారుతి సుజుకీ జతకట్టింది. కంపెనీకి చెందిన డీలర్లకు ఆర్థిక సహా యం అందించడానికి ఒప్పం దం కుదుర్చుకున్నట్లు మారుతి సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి శశాంక్ శ్రీవాత్సవ తెలిపారు. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న 4 వేల డీలర్లకు ఆర్థిక సహాయం లభించనున్నది.2008 నుంచి యూనియన్ బ్యాంక్‌తో కలిసి పనిచేస్తున్నట్లు, ఇప్పటి వరకు 3 లక్షల కార్లకు రుణాన్ని అందించిందన్నారు. ఈ సందర్భంగా యూబీఐ ఎండీ, సీఈవో ఏ మణిమేఖలాయ్ మాట్లాడుతూ.. కస్టమర్లకు సులభంగా రుణాన్ని అందించాలనే ఉద్దేశంతో మారుతితో జట్టుకట్టినట్టు, ఇప్పటి వరకు లక్షలాది కార్లకు రుణాన్ని మంజూరు చేసినట్లు చెప్పారు.భవిష్యత్ భారత్‌దే: మారుతి చైర్మన్‌మరే దేశంలోనూ లేనంత స్థా యిలో భవిష్యత్ వృద్ధి అవకాశాలు భారత్‌లో ఉన్నాయని మారుతి సుజుకి చైర్మన్ ఆర్‌సీ భార్గవ చెప్పారు. ఆయన ఒక సదస్సులో మాట్లాడుతూ పశ్చిమ దేశాల్లో వృద్ధి డైలమాలో పడిందని, అక్కడి ప్రజలు పని విలువల్ని వదిలేశారని, పనిచేయకుండానే విలాస జీవితం కావాలని కోరు కుంటున్నారని అన్నారు.మరోవైపు భారత్‌లో ప్రజలు వారి సొంత భవిష్యత్ కోసమే కాకుండా, వారి కుటుంబాలు, పిల్లల కోసం వృద్ధిని ఆకాంక్షిస్తున్నారని భార్గవ చెప్పారు. అటువంటి ఆకలే భారత్‌ను ముందుకు నడిపిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో దేశం ముందుకెళ్లడానికి వివిధ బూ జుపట్టిన చట్టాలు, నిబంధనల్ని వదిలించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.తమ ఉత్పాదక సామ ర్థ్యాన్ని ఒక లక్ష కార్ల నుంచి 22 లక్షలకు కార్లకు పెంచుకున్నామని, ఈ వృద్ధి అంతా అంతర్గత వనరుల ద్వారానే



సాధించామని, దీనిని ఎటువంటి రుణ సదుపాయం పొందకుండానే 40 లక్షలకు పెంచుకుంటామన్నారు. తమ వద్ద రూ. 50,000 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయన్నారు.

## హైదరాబాద్‌లో మిల్టెనీ తొలి కార్యాలయం

**హైదరాబాద్:** హైదరాబాద్‌కు రావడమంటే సొంతింటికి వచ్చినట్టు అనిపిస్తున్నది. ఇక్కడి ప్రజలు, అలవాట్లు నాకు ఎంతో నచ్చుతాయి. హైదరాబాద్‌లో గ్లోబల్ సెంటర్‌ను నెలకొల్పడానికి ఇది కూడా ఓ కారణంగానే చెప్పుకోవచ్చు. గత నాలుగేండ్లుగా హైదరాబాద్ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తుండటంతో మా సంస్థకు ఇదే ప్రధాన కేంద్రంగా మారిపోయింది. మా సంస్థకు మార్కెట్ పరంగా భారత్ ఎంతో కీలకం. ప్రొవిడెన్స్ ప్రెసిడెంట్, సీఈవో రోడ్నీ హెూఫ్‌మ్యాన్‌హైదరాబాద్, ఫిబ్రవరి 27: జర్మనీకి చెందిన బయోమెడికల్ ఉత్పత్తుల తయారీ సంస్థ మిల్టెనీ బయోటెక్..భారత్‌లో తన కార్యకలాపాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో తన తొలి కార్యాలయాన్ని ప్రారంభించిన సంస్థ..భవిష్యత్తులో ఇక్కడ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ) ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లో జరుగుతున్న బయోఏషియా వేదికపై కంపెనీ ఎండీ బోరిస్ స్టోఫెల్ ఈ విషయాన్ని ప్రకటించారు.ముందస్తు క్లినికల్/క్లినికల్ డెవలప్‌మెంట్, వాణిజ్య అవసరాలనిమిత్తం సైంటిస్టులు, పరిశోధకులు, పరిశ్రమ వర్గాలు, క్లాస్‌రూమ్‌లో క్లినికల్‌కు సంబంధించి ప్రయోగాత్మక శిక్షణ పొందేందుకు వీలుగా ఈ సెంటర్‌ను నెలకొల్పుతున్నట్లు ఆయన చెప్పారు. దేశీయ సైంటిస్టులు, పరిశోధకులు సులభంగా వారి రిసెర్చ్‌లను చేయడానికి వీలు పడనున్నదని తెలిపింది. ఈ కేంద్రం శాస్త్రీయ సమాజంలో చికిత్సలను అభివృద్ధి చేయడంలోను ప్రపంచవ్యాప్తంగా ఉన్న రోగులకు ఆరోగ్య సంక్షరణకు



సహాయపడటానికి దోహదం చేయనున్నదన్నారు.

## కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో ఎన్ని హామీలు ఉన్నాయో తెలుసా..
# రేవంత్‌రెడ్డిపై సత్యవతి రాథోడ్ ఫైర్

**హైదరాబాద్:** మహిళలను కించపరిచే విధంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడిగానే రేవంత్ రెడ్డి భాష ఉందని.. ముఖ్య మంత్రి అనే సోయి ఆయనకు లేదని మండి పడ్డారు.ఇందిరమ్మ రాజ్యం అంటూ మహిళలను అగౌరవపర్చే విధంగా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియాతో మాట్లాడిన సత్యవతి రాథోడ్.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఎన్ని హామీలు ఉన్నాయో రేవంత్ రెడ్డికి తెలుసా అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీల్లో మొత్తం 13 హామీలు ఉన్నాయన వివరి ంచారు.మహాలక్ష్మి పథకం కిందనే మూడు హామీలు ఉన్నాయని సత్యవతి రాథోడ్ అన్నారు. మహిళలకు ఇస్తామన్న 2,500 రూపాయల హామీ ఏమైందని ప్రశ్నించారు. 500 రూపాయల గ్యాస్ సబ్సిడీ 40 లక్షల మందికి మాత్రమే వర్తిస్తుందని.. రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డులకు ఈ స్కీం వర్తింపజేయాలని అన్నారు. గ్యాస్ కనెక్షన్లు కేవలం మహిళల పేరు మీద ఉంటేనే సబ్సిడీ వస్తుందని ప్రభుత్వం చెప్తోందని.. గ్యాస్ కనెక్షన్లు



పురుషుల పేరు మీద ఉన్నా సబ్సిడీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పథకం బోగస్ పథకంగా మారిందని ఆమె ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో మారుమూల గ్రామాలకు కూడా ఆర్టీసీ బస్సులను నడపాలని సత్యవతి రాథోడ్ కోరారు. మహిళలకు సరిపడా బస్సులను ప్రభుత్వం నడపాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల చట్టబద్ధత ఏమైందని నిలదీశారు. పింఛన్లు 4,000 ఎప్పటి నుంచి అమలు చేస్తారని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ సిద్ధమైందని ఆరోపించారు. గుడ్డిగా హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఆరు గ్యారెంటీలు అని చెప్పి ఆరు వందల కొర్రీలు పెడుతున్నారని మండిపడ్డారు.రేవంత్ రెడ్డి పరుష పదజాలం మానుకోవాలని సత్యవతి రాథోడ్ హితవు పలికారు. కేసీఆర్ కుటుంబాన్ని తిట్టడమే రేవంత్ రెడ్డి ఎజెండాగా ఉందని విమర్శించారు. రేవంత్ రెడ్డి సీటును టచ్ చేసే వాళ్లు పక్కనే ఉన్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ఫ్రస్టేషన్‌లో ఉన్నారని అన్నారు. తాను జైలుకు వెళ్లానని అందరిని జైలుకు పంపాలని రేవంత్ రెడ్డి అనుకుంటున్నారని విమర్శించారు.దళితులు, గిరిజనులకు బీఆర్ఎస్ ప్రభుత్వం 100 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇచ్చిందని సత్యవతి రాథోడ్ గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితంగా ఇచ్చేది 100 యూనిట్లేనా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచిన ఉద్యోగ నియామక పత్రాలు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించినవే అని గుర్తుచేశారు.

# రాంపూర్ లో ఘోర రోడ్డు ప్రమాదం

- కారు, బైక్ ఢీ
- ప్రమాదంలో ముగ్గురు మృతి
- క్షతగాత్రులను సిద్దిపేట ఆస్పత్రికి తరలింపు
- మృతదేహాలను ప్రభుత్వ మార్చురీకి తరలింపు
- మార్చురీ, ఆస్పత్రి ప్రాంగణంలో మిన్నంటిన రోదనలు







**సిద్దిపేట, ఫిబ్రవరి 28**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాంపూర్ క్రాసింగ్ వద్ద బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బద్దిపడగ రాంపూర్ క్రాసింగ్ శ్రీనిధి రైస్ మిల్లు సమీపంలో కారు బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో నంగునూరు మండల కేంద్రానికి చెందిన రవి (55), నాగరాజుపల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణ, కారులో ప్రయాణిస్తున్న మమత (28) ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. న్యాన్సీ (2), కీర్తన (35), భానుప్రసాద్ (11), ప్రణయ్ (8), చరణ్ (11), వైష్ణవి (6), హాన్విక (8నెలలు), బాపురాజు (33) గాయపడ్డారు. మొత్తం 9 మందిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ గాంధీకి రిఫర్ చెందినట్లు వైద్యాధికారులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అతి వేగమే ప్రమాదానికి ప్రధాన కారణమని, కారు బైకును ఢీకొనగా కారు రోడ్డు పక్క గుంతలో పడిందని తెలిపారు. మృతి చెందిన ముగ్గురిని ట్రాక్టర్ లో ప్రభుత్వ మార్చురీకి తరలించారు. ప్రమాదంలో గాయపడిన వారిని ఆసుపత్రికి అంబులెన్స్‌లో తీసుకవచ్చారనే విషయం తెలుసుకున్న ప్రభుత్వాసుపత్రి ఇంచార్జీ సూపరింటిండెంట్ సైకియాట్రి విభాగ హెచ్ఓడీ డాక్టర్ శాంతి, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత దగ్గరుండి క్షతగాత్రులను వివరాలను అడిగి తెలుసుకుని వారికి భరోసా కల్పిస్తూ వైద్య సిబ్బంది చేత చికిత్స అందేలా చూశారు. పిల్లల విభాగ వైద్యుడు కోట వేణు పిల్లలను పరీక్షించి వైద్య చికిత్స అందించారు.





### మిన్నంటిన రోదనలు...

సిద్దిపేట ప్రభుత్వ మార్చురీ వద్ద, ఆసుపత్రి ప్రాంగణంలో మృతిచెందిన, గాయపడిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఆర్తనాదాలతో దద్దరిల్లింది. మృతదేహాలపై పడి కుటుంబ సభ్యులు పడి రోదించిన తీరు అక్కడ ఉన్న వారిని కంటతడి పెట్టించింది. కుటుంబ సభ్యులు బాబాయి, పిన్ని, అన్నయ్య, చిన్ని, నాని అంటూ ఏమైందిరా అంటూ రోదించారు.

# దేశం దీర్ఘకాలిక ప్రయోజనాలే బీజేపీ లక్ష్యం

## కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి28:** దేశం దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం కట్టుబడి ప్రణాళికలు రూపొందించడం మా ప్రభుత్వం లక్ష్యం.. దేశ నిర్మాణం ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యం.. బీజేపీ.. నాన్ బీజేపీ ప్రభుత్వాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలి అని సూచించారు కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్.. విశాఖలో క్లస్టర్ ప్రవాస్ యోజనలో భాగంగా జరిగిన మేధావుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ద్రవ్య లోటుతో ప్రపంచంలో అనేక దేశాలు అతలాకుతలం అవుతుంటే కరెంట్ డెఫ్ షీట్ లేని దేశంగా భారత్ అవిర్భవించింది.. ఖతార్ లో గూఢ చర్యం కేసులో చిక్కుకుని శిక్ష అనుభవిస్తున్న భారత మాజీ నేవీ అధికారులను సురక్షితంగా స్వదేశానికి రప్పించిన దౌత్య నీతి.. ప్రధాని కారణంగా సాధ్యం అయ్యిందన్నారు. ఉక్రెయిన్ యుద్ధంలో చిక్కుకున్న వేలాది మంది విద్యార్థులను స్వదేశానికి తెచ్చిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు.కేవలం రాజకీయాల కోసమే భారతీయ జనతాపార్టీ లేదు, దేశాన్ని ప్రపంచ అగ్రస్థానంలో నిలపాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తోందన్నారు రాజ్‌నాథ్.. ట్రిపుల్ తలాక్, సివిల్ కామన్ కోడ్, అయోధ్య రామాలయం, ఆర్టికల్ 377 ద్వారా కాశ్మీర్ లో స్వేచ్ఛా వాయువులు లాంటి సాహసోపేత నిర్ణయాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఇక, 2027 నాటికి ప్రపంచంలోనే భారత్ మూడో ఆర్థిక శక్తిగా నిలబడడంలో ఎలాంటి సందేహం లేదన్న ఆయన.. 2047 నాటికి ప్రపంచ ఆర్థిక శక్తిగా అవతరించేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాం అన్నారు. %ఖ×% లావాదేవీల్లో భారత్ ప్రపంచంలో నెంబర్ 1గా ఉంది.. ఎన్నికలు, ప్రభుత్వం ఏర్పాటు కోసం పని చేస్తున్న ప్రభుత్వం బీజేపేది.. రాబోయే ఐదు %--% ఏడేళ్ల కాలంలో ప్రతీ జిల్లాకు ఒక మెడికల్ కాలేజ్ ఏర్పాటు కాబోతున్నాయన్నారు.భారతీయ జనతా పార్టీ మతత్వ పార్టీ కాదు..

# పవన్ అంటే..వామనుడి పాదం

## తాడేపల్లిగూడెం సభలో పవన్ కళ్యాణ్ నిప్పులు

**తాడేపల్లిగూడెం,ఫిబ్రవరి28:** బలిచక్రవర్తిని తొక్కినట్లుగా జగన్‌ను తొక్కి..నా పవరేంటో చూపిస్తా అని జనసేనా పవన్ కళ్యాణ్ అన్నారు. పొత్తులో భాగంగా 24 అసెంబ్లీ సీట్లు తీసుకున్నా. 24 సీట్లేనా అని అవతలి పక్షం విమర్శించింది. బలి చక్రవర్తి కూడా వామనుడిని చూసి ఇంతేనా అన్నారు. నెత్తిన కాలుపెట్టి తొక్కితే ఎంతో అని తెలిసింది. జగన్‌ను అధఃపాతాళానికి తొక్కకపోతే నా పేరు పవన్ కాదు. కార్యకర్తలారా వ్యూహం నాకు వదలండి.. నన్ను నమ్మండి. గాయత్రి మంత్రం కూడా 24 అక్షరాలే. అంకెలు లెక్కపట్టవద్దని విపక్షాలకు చెప్పండి. ఒక్కో ఇటుక పేర్చి ఇల్లు కడుతున్నా.. కోట కూడా కడతాం. జగన్ తాడేపల్లి కోట కూడా బద్దలుకొడతాం. సలహాలు ఇచ్చేవాళ్లు అక్కర్లేదు.. యుద్ధం చేసే వాళ్లు కావాలి అన్నారు. తాడేపల్లిగూడెం వేదికగా జరిగిన తెలుగు జన విజయ కేతనం సభలో సీఎం జగన్ పై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జగన్.. నేనూ తెలుగు మీడియంలోనే చదువుకున్నాను. సంస్కారం ఉన్నందునే నీలా మాట్లాడలేకపోతున్నా. ఓ సామాన్యుడు రాజకీయాలు చేస్తే తట్టుకోలేక పోతున్నారు. నిన్ను అధఃపాతాళానికి తొక్కే వామనుడి పాదం నేను. వ్యూహాలు రచిస్తాం.. జగన్ కోటలు బద్ధలు కొడతాం. సిద్ధం సిద్ధం అంటున్నావ్.. కానీ నీకు నేను యుద్ధాన్ని ఇస్తున్నా. ఐదుగురు రెడ్ల కోసం 5 కోట్ల మంది ప్రజలు తిప్పలు పడుతున్నారు. వైసీపీ గూండాయిజానికి కార్యకర్తలు భయపడవద్దు. మా సభలు, నాయకులపై వైసీపీ గూండాలు దాడులు చేస్తే ఊరుకునేది లేదు. ప్రశ్నించే వారిపై వైసీపీ దాడులు చేస్తోందని పవన్ కళ్యాణ్ స్టాం÷-రగ్ కామెంట్స్ చేశారు. నాతో నడిచే వాళ్లే.. నా వాళ్లు. ఓడినప్పుడు మీతోనే ఉన్నాను. గెలిచినా మీతోనే ఉంటాను. పవన్‌తో స్నేహం అంటే చచ్చేదాకా.. వైరం అంటే అవతలి వాడు చచ్చేదాకా. సలహాలు ఇచ్చే వాళ్లు కాదు- పోరాడేవాళ్లు కావాలి. శక్తి సామర్థ్యాలు చూసుకునే 24 అసెంబ్లీ, 3 పార్లమెంటు స్థానాలకు ఒప్పుకున్నాం. టీడీపీ-జనసేన సహకారంతోనే ప్రజలకు భవిష్యత్ ఉంటుంది. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే పొత్తులు పెట్టుకున్నాం.

## వైభవంగా లక్ష్మీనరసింహస్వామి

# కళ్యాణ మహోత్సవం

### - పట్టు వస్త్రాలను సమర్పించిన శ్రీనివాస్ రెడ్డి





**దుబ్బాక, ఫిబ్రవరి 28,**
దుబ్బాక నియోజకవర్గం పరిధిలోని బోనాల కొండాపూర్ గ్రామంలో బుధవారం లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం ఉత్సవాలలో పాల్గొని పట్టు వస్త్రాలను సమర్పించి 51 వేల రూపాయలను దేవాలయానికి అందించ్చి ప్రత్యేక పూజలు నిర్వహించిన దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి తదనంతరం మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లవేళలా ఉండాలని ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో దుబ్బాక నియోజకవర్గం ప్రజలకు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ ఎంపీపీ మాసుల శ్రీనివాస్ ఉపాధ్యక్షులు మాసాయిపేట శ్రీనివాస్ రాంపూర్ మాజీ సర్పంచ్ కాశబోయిన భాస్కర్ యువ నాయకుడు సంద్రు శ్రీకాంత్, దుబ్బాక నియోజకవర్గ యువజన అధ్యక్షులు సాయి కుమార్ గౌడ్ జూకంటి రాజా గౌడ్ జనరల్ సెక్రెటరీ మోజామిల్ కొండి శ్రీనివాస్ ఎస్సి సెల్ అధ్యక్షుడు స్టాలిన్ నర్సింహులు ఎస్టి సెల్ అధ్యక్షుడు ఫకీర్ నాయక్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మోహన్ నాయక్ యువజన అధ్యక్షుల మద్దూరి రాజు సీనియర్ నాయకుడు కాంశెట్టి సతీష్ కుమార్ చౌదరి శ్రీనివాస్ గోపాల్ రెడ్డి గ్రామ అధ్యక్షులు నర్సింలు మండల సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం విద్యకు పెద్దపీట

### - కాంగ్రెస్ ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి

**దుబ్బాక, ఫిబ్రవరి 28,**
కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని దుబ్బాక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని మిరుదొడ్డి మోడల్ స్కూల్లో సదుపాయాల కల్పనకు మంజూరైన 27 లక్షల ప్రతిపాదన పత్రాన్ని పాఠశాల ప్రిన్సిపల్ భారతీదేవికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత ర్యాంకులు సాధించాలని ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రభుదాస్, మోడల్ స్కూల్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన

**దుబ్బాక, ఫిబ్రవరి 28,**

ఆర్బిఐ ఆదేశాలనుసారం ఫైనాన్షియల్ లిటరసీ వీక్ లో భాగంగా ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం అవగాహన సదస్సు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు- దుబ్బాక వారి ఆధ్వర్యంలో దుబ్బాక గవర్నమెంట్ హై స్కూల్ లో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా స్కూల్ విద్యార్థులకు చిన్న మొత్తాల పొదుపు, సైబర్ నేరాల గురించి విద్యార్థులకు బ్యాంకింగ్ పైన అవగాహన కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో మెదక్ డీసీసీబీ బ్యాంక్ దుబ్బాక సూపర్వైజర్ లు అశోక్, శ్రీనివాస్, ఎల్డీఎం ఆఫీస్ నుంచి ఎఫ్ ఎల్ సి కౌన్సిలర్ దయాకర్, సిద్దిపేట సి ఎఫ్ ఎల్ కోఆర్డినేటర్ మహేష్ పాఠశాల ఉపాధ్యాయిని




ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొనడం జరిగింది మరియు క్విజ్ పోటీ నిర్వహించి ఈ పోటీలో విజేతలుగా నిలిచిన వారికి ప్రధానోపాధ్యాయులు మోహత్ జమీర్ మొహిద్దిన్ గారి చేతుల మీదుగా బ్యాంక్ అధికారుల చేత బహుమతులు అందించారు.

# బండి యాత్ర శాంతిభద్రతలకు విఘాతం

### - టిపిసిసి సభ్యుడు కేడం లింగమూర్తి



**హుస్నాబాద్ ఫిబ్రవరి 28:**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో టీ పి సిసి సభ్యుడు కేడం లింగమూర్తి మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బండి సంజయ్ ఒకే ఊరులో ఉండి కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ తల్లిని మరొక మారు హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో బండి సంజయ్ అవమానపరిచే విధంగా మాట్లాడారని టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి ఆరోపించారు.
ఏం మాట్లాడుతున్నాడో కనీస ఇంగిత జ్ఞానం లేని ఆలోచనతో ఎంపీ బండి సంజయ్ మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయాలలోకి కన్నతల్లిని తీసుకురావడం ఏంటని ప్రశ్నించారు. యాత్రల పేరిట ప్రజలలో యుద్ధ వాతావరణం సృష్టించడానికి బండి సంజయ్ ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను చైతన్య పరిచే విధంగా పాదయాత్రలు ఉండాలే కానీ వారిని రెచ్చగొట్టే విధంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఉండకూడదని హితవు పలికారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తల్లి పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని,బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కేడీసీసీ చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మండల అధ్యక్షులు బంక చందు, కౌన్సిలర్ వల్లపు రాజు, ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షులు విశ్వతేజ, కాంగ్రెస్ అక్కన్నపేట మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య, బూరుగు కృష్ణస్వామి పెరుమాండ్ల నర్సాగౌడ్, వెన్న రాజు, బిక్య నాయక్, గట్టు రాములు. మడప జయపాల్ రెడ్డి, పోలోజు రవీంద్ర చారి, మైదం శెట్టి వీరన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# పంత్ వస్తే జురెల్ పరిస్థితి ఏంటి..?

టీమిండియా యువ వికెట్ కీపర్, ఇంగ్లండ్‌తో రాజ్‌కోట్ టెస్టులో అరంగేట్రం చేసిన ధ్రువ్ జురెల్ ఆడిన రెండు మ్యాచ్‌లలోనూ అంచనాలకు మించి రాణించాడు. ఫ్యూచర్ ధోనీ అంటూ ప్రశంసలు అందుకుంటున్న జురెల్.. అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో ఆరంభాల్ని అయితే సద్వినియోగం చేసుకున్నాడు. అరంగేట్ర టెస్టులో నిలకడ, రాంచీ టెస్టులో అతడు చూపిన తెగువపై సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి. వికెట్ కీపింగ్‌తో పాటు అతడి బ్యాటింగ్ స్కిల్స్ చూసిన సెలక్టర్లు.. అతడిని టెస్టులలో ఎక్కువకాలం కొనసాగించాలని భావిస్తున్నారు. ఇప్పటివరకూ బాగానే ఉన్నా టీమిండియాకు టెస్టులలో రెగ్యులర్ వికెట్‌కీపర్‌గా ఉన్న రిషభ్ పంత్ తిరిగొస్తే జురెల్ పరిస్థితేంటి..? అతడికి ఫైనల్ లెవెన్‌లో చోటు దక్కుతుందా..? లేక బెంచ్‌కే పరిమితమవుతాడా..?పంత్ రీఎంట్రీ..2022 డిసెంబర్ 30న కారు ప్రమాదానికి గురై ఇప్పు డిప్పుడే పూర్తిస్థాయిలో కోలుకుంటున్న పంత్.. ఐపీఎల్‌లో రీంఎట్రీ ఇవ్వనున్నట్టు సమాచారం. ఐపీఎల్ తర్వాత నేరుగా భారత జట్టులోకి వస్తాడా..? రాడా..? అన్నది మాత్రం ప్రస్తుతానికైతే సస్పెన్సే. అయితే ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ ముగిశాక భారత జట్టు మళ్లీ ఆగస్టు నుంచి స్వదేశంలో టెస్టులు ఆడనుంది. బంగ్లాదేశ్ జట్టు భారత్‌తో టెస్టులు ఆడేందుకు ఇక్కడకు రానుంది. ఈ సిరీస్ వరకైనా పంత్ టెస్టు జట్టులోకి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఏం పర్లేదు..మరి పంత్ వస్తే జురెల్‌ను తప్పిస్తారా..? అంటే బీసీసీఐ మాత్రం అలాంటిదేమీ లేదని అంటోంది. పంత్ వచ్చినా జురెల్‌కు వచ్చిన నష్టమేమీ లేదని, అతడిని స్పెషలిస్టు బ్యాటర్‌గా అయినా కొనసాగించొచ్చని బీసీసీఐ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇదే విషయమై ఆయన మాట్లాడుతూ.. 'పంత్ వచ్చినా ధ్రువ్ జురెల్ జట్టులో తన స్థానాన్ని నిలుపుకుంటాడు. స్పెషలిస్టు బ్యాటర్‌గా కొనసాగుతాడు..' అని తెలిపాడు.అప్పుడే అసలైన సవాలు..ఇంగ్లండ్‌తో సిరీస్‌లో భారత జట్టుకు జురెల్, సర్ఫరాజ్, ఆకాశ్ దీప్ రూపంలో నాణ్యమైన క్రికెటర్లు దొరికారు. ఈ సిరీస్‌లో యశస్వీ జైస్వాల్ కూడా అంచనాలకు మించి రాణించాడు. అయితే స్వదేశంలో ఉన్న అనుకూలత, అదీగాక ఇవే పిచ్‌లపై దేశవాళీలో ఆడిన అనుభవం వాళ్లకు పనికివచ్చింది. కానీ జైస్వాల్, సర్ఫరాజ్, జురెల్, ఆకాశ్ దీప్ వంటి యువ క్రికెటర్లకు అసలైన సవాల్ విదేశాల్లోనే. ఈ ఏడాది చివర్లో భారత జట్టు.. ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఈ యువ ఆటగాళ్లంతా అక్కడ ఎలా రాణిస్తారనేదాన్ని బట్టి వాళ్ల భవితవ్యం తేలనుంది.



# టీమిండియాకు గుడ్ న్యూస్..
## ఐదో టెస్టుకు స్టార్ పేసర్ రీఎంట్రీ


ఇంగ్లండ్‌తో స్వదేశంలో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా ఇప్పటికే 3-1తో సిరీస్ సొంతం చేసుకున్న భారత జట్టుకు ధర్మశాల వేదికగా జరగాల్సి ఉన్న ఐదో టెస్టుకు శుభవార్త. రాంచీ టెస్టుకు దూరమైన టీమిండియా ఏస్ పేసర్ జస్ప్రిత్ బుమ్రా.. ధర్మశాలలో ఆడే అవకాశమున్నట్టు సమాచారం. ఈ మేరకు అతడు టీమ్ మేనేజ్‌మెంట్‌కు ఈ విషయాన్ని చెప్పినట్టు తెలుస్తోంది. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రా.. నాలుగో టెస్టుకు దూరమైన విషయం తెలిసిందే.రాంచీ టెస్టులో బుమ్రా గైర్హాజరీ కారణంగా బెంగాల్ పేసర్ ఆకాశ్ దీప్ ఎంట్రీ ఇచ్చాడు. ఆడిన తొలి టెస్టులోనే అతడు ఆకట్టుకున్నాడు. రాంచీలో గెలిచి భారత్ సిరీస్ నెగ్గిన నేపథ్యంలో భారత జట్టు ఐదో టెస్టులో ప్రయోగాలు చేసే అవకాశమున్నదని, సీనియర్ ప్లేయర్లకు రెస్ట్ ఇచ్చి కొత్త కుర్రాళ్లకు ఛాన్స్‌లు ఇవ్వనున్నట్టు గతంలో వార్తలు వచ్చినా ఐదో టెస్టుకు మాత్రం బుమ్రాను ఆడించనున్నట్టు తెలుస్తున్నది. బుమ్రా వస్తే సిరాజ్‌కు రెస్ట్ ఇవ్వొచ్చు. ధర్మశాల పిచ్ పేసర్లకు అనుకూలంగా ఉంటుందని గుసగుసలు వినిపిస్తున్న వేళ.. స్పిన్ ఎటాక్ కంటే పేసర్లతో ఇంగ్లండ్‌కు కట్టడి చేయాలని భారత్ భావిస్తోంది. ఇందులో భాగంగానే బుమ్రాను ఐదో టెస్టులో ఆడించనున్నారని సమాచారం.ఇక టీమిండియా మిడిలార్డర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ధర్మశాల టెస్టులో కూడా ఆడేది అనుమానమే. తొడ కండరాల గాయంతో బాధపడుతున్న అతడు.. మెరుగైన వైద్యానికి త్వరలోనే లండన్‌కు వెళ్లనున్నట్టు వార్తలు వస్తున్నాయి. దీంతో అతడు ఈ టెస్టుకు దూరమవ్వనున్నాడు. ఇక మూడు టెస్టులలో విఫలమైన రజత్ పాటిదార్‌కు ఐదో టెస్టులో రెస్ట్ ఇచ్చి పడిక్కల్‌ను తుది జట్టులో ఆడించే అవకాశాలున్నాయి. ఇండియా ఇంగ్లండ్ మధ్య ఆఖరి టెస్టు.. మార్చి 07 నుంచి ధర్మశాల వేదికగా మొదలుకానుంది. ఈ మ్యాచ్ తర్వాత భారత్.. సుమారు రెండున్నర నెలల పాటు అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడదు. ఐదో టెస్టు ముగిసిన కొద్దిరోజులకే ఐపీఎల్ (మార్చి 22 నుంచి) మొదలవనుంది.



# మూడోసారి తండ్రి అయిన కేన్ మామ..
## ఆడబిడ్డకు జన్మనిచ్చిన సారా

న్యూజిలాండ్ మాజీ సారథి, అభిమానులంతా కేన్ మామ అని పిలుచుకునే కేన్ విలియమ్సన్ మూడోసారి తండ్రి అయ్యాడు. కేన్ భార్య సారా రహీం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని విలియమ్సన్ స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించాడు. ఈ జంటకు ఇప్పటికే ఓ బాబు, పాప ఉన్నారు. ఫిబ్రవరి 28న కేన్ మామ ముచ్చటగా మూడో బిడ్డకు తండ్రి అయ్యాడు. ఇన్‌స్టా వేదికగా విలియమ్సన్ స్పందిసూ 'ఇక ఇప్పుడు ముగ్గురు. అందమైన పాపాయికి ఈ ప్రపంచంలోకి స్వాగతం. ఈ లోకంలోకి జాగ్రత్తగా వచ్చినందుకు చాలా థ్యాంక్యూ. అద్భుతమైన ప్రయాణం ముందుంది..' అంటూ రాసుకొచ్చాడు.

కేన్ మామ ఈ విషయం చెప్పగానే ఆ దంపతులకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.2015 నుంచి రిలేషన్‌షిప్‌లో ఉంటున్న కేన్ సారాలు ఇప్పటివరకూ తమ పెళ్లిని అధికారికంగా ధ్రువీకరించలేదు. 2020లో ఈ జోడీకి పాప పుట్టగా 2022 మేలో బాబు పుట్టాడు. బాబు పుట్టినప్పుడు కేన్ మామ.. ఐపీఎల్ 2022లో బయో బబుల్ నుంచి వెళ్లిపోయిన విషయం విదితమే. ఇక తాజాగా స్వదేశంలో ఆస్ట్రేలియాతో ముగిసిన టీ20 సిరీస్‌కు మిస్ అయిన విలియమ్సన్.. ఫిబ్రవరి 29 నుంచి మొదలుకాబోయే రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు మాత్రం అందుబాటులో ఉండనున్నాడు. ఇటీవలే సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో అతడు.. వరుస మ్యాచ్‌లలో సెంచరీలు చేసిన విషయం తెలిసిందే.



# ప్రపంచ క్రికెట్‌లో అరుదైన సన్నివేశం..
## కలిసి క్రికెట్ ఆడిన బాబాయ్

క్రికెట్‌లో అన్నాతమ్ముళ్లు, అక్కా చెల్లెల్లు ఆడట సర్వ సాధారణమే. ఇప్పటికీ అంతర్జాతీయ క్రికెట్‌లో కవలలు, అన్నాతమ్ముళ్లు, అక్కాచెల్లెల్లు కలిసి క్రికెట్ ఆడుతున్నారు. కానీ బాబాయ్ అబ్బాయ్ కలిసి క్రికెట్ ఆడటం ఎప్పుడైనా చూశారా..? అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ అరుదైన సన్నివేశం బుధవారం చోటుచేసుకుంది. ఐర్లాండ్-అఫ్గనిస్తాన్ మధ్య జరుగుతున్న ఏకైక టెస్టులో ఈ అద్భుతం ఆవిష్కృతమైంది. అఫ్గాన్ తరఫున స్టార్ బ్యాటర్‌గా ఉన్న ఇబ్రహీం జద్రాన్.. తన బాబాయ్ అయిన నూర్ అలి జద్రాన్‌తో కలిసి అఫ్గనిస్తాన్ ఇన్నింగ్స్‌ను ఓపెన్ చేయడం విశేషం. ఇబ్రహీం వయసు 22 ఏండ్లు కాగా నూర్ అలీకి 35 ఏండ్లు.ఐర్లాండ్‌తో అబుదాబి వేదికగా జరుగుతున్న తొలి టెస్టు ఇందుకు వేదికైంది. నూర్ అలీ జద్రాన్.. 2009లోనే అఫ్గాన్ తరఫున వన్డేలు ఆడినా ఆ తర్వాత అతడు పలు కారణాలతో జాతీయ జట్టుకు దూరమయ్యాడు. కానీ ఇటీవలే దేశవాళీలలో రాణించి మళ్లీ టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఇటీవలే శ్రీలంకతో జరిగిన ఏకైక టెస్టులో నూర్ అలీ.. తన అల్లుడైన ఇబ్రహీం జద్రాన్ చేతి నుంచే అరంగేట్ర క్యాప్ అందుకున్నాడు. తాజాగా ఐర్లాండ్‌తో సిరీస్‌లో ఈ ఇద్దరూ కలిసి అఫ్గాన్ ఇన్నింగ్స్ ఓపెన్ చేయడం గమనార్హం. ఈ ఇద్దరూ కలిసి ఆడుతున్న ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.ఇక టెస్టు విషయానికొస్తే.. అబుదాబిలోని టాలరెన్స్ ఓవల్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన అఫ్గనిస్తాన్ 36 ఓవర్ల ఆట ముగిసేసరికి ఏడు వికెట్లు కోల్పోయి 111 పరుగులు చేసింది.



# 2024 ఐపిఎల్‌పై ఫోకస్..
## జిమ్‌లో చెమటోడుస్తున్న రిషబ్ పంత్.. వీడియో

**న్యూఢిల్లీ:** వికెట్ కీపర్ రిషబ్ పంత్ఐపీఎల్ 2024 కోసం రెడీ అవుతున్నాడు. ఫిట్‌నెస్ కోసం అతను తీవ్రంగా శ్రమిస్తున్నాడు. జిమ్‌లో గంటలు గంటలు ఎక్సర్‌సైజ్‌లు చేసన్నాడు. జిమ్ సెషన్‌కు చెందిన ఓ వీడియోను తన ఇన్‌స్టాలో పోస్టు చేశాడు లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్.2022 డిసెంబర్ నుంచి రిషబ్ క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. ఆ ఏడాది డిసెంబర్ 30వ తేదీన రిషబ్ కారు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. రెండేళ్ల తర్వాత మళ్లీ క్రికెట్ మైదానంలో అడుగుపెట్టాలన్న ఉద్దేశంతో అతను కసరత్తులు చేస్తున్నాడు.కారు ప్రమాదం నుంచి కోలుకున్న రిషబ్.. బెంగుళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీలో ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకున్నాడు. పూర్తి స్థాయిలో అతను రికవరీ అయ్యాడు. అయితే ఐపీఎల్ 2024కు రిషబ్ పంత్ ఫిట్‌గా ఉన్నట్లు ఢిల్లీ క్యాపిటల్స్ ప్రధాన కోచ్ రిక్కీ పాంటింగ్ తెలిపాడు. ఐపీఎల్‌లో పంత్ అన్ని మ్యాచ్‌లు ఆడుతాడన్న నమ్మకం ఉందని రిక్కీ చెప్పాడు.



# లండన్‌కు స్టార్ బ్యాటర్ ..
## అయిదో టెస్టుకు డౌటే



**న్యూఢిల్లీ:** స్టార్ ఇండియన్ బ్యాటర్ కేఎల్ రాహుల్ .. ఇంగ్లండ్‌తో జరిగిన గత మూడు టెస్టులకు గాయం వల్ల దూరంగా ఉన్న విషయం తెలిసిందే. అయితే ధర్మశాలలో జరగనున్న ఫైనల్ గేమ్‌కు కూడా అతను దూరం అయ్యే ఛాన్సు కనిపిస్తోంది. ఇంగ్లండ్‌తో జరిగిన ఫస్ట్ టెస్ట్ సమయంలో తొడ కండరాలు పట్టేయడంతో గాయపడ్డ కేఎల్ రాహుల్ ఇంకా కోలుకోనట్లు తెలుస్తోంది. పూర్తి స్థాయిలో అతను రికవరీ కాకపోవడంతో అతన్ని బీసీసీఐ లండన్‌కు పంపింది. నిపుణుల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు అతన్ని లండన్‌కు పంపినట్లు బీసీసీఐ వర్గాల ద్వారా స్పష్టం అవుతోంది. వాస్తవానికి మూడవ టెస్టు ఆడేందుకు కేఎల్ రాహుల్‌కు క్లియరెన్స్ దక్కినా చివరి నిమిషంలో మళ్లీ అతన్ని తప్పించారు. ఒకవేళ రాహుల్ రికవరీ అయితే అతన్ని ఆడించాలనుకున్నారు. కానీ ఇప్పటికే ఈ సిరీస్‌లో ఇండియా లీడింగ్‌లో ఉన్న కారణంగా అతనికి మరింత రెస్ట్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. టీ20 వరల్డ్‌కప్‌ను దృష్టిలో పెట్టుకుని కేఎల్ రాహుల్‌కు మరింత టైం ఇచ్చినట్లు అర్థమవుతోంది.

# 'ధ్రువ్ తార'.. ఇతన్ని చూస్తే మరో ధోనీ తయారవుతున్నాడని అనిపిస్తున్నది!!

**క్రీడావిభాగం :** సంధి దశలో ఉన్న భారత టెస్టు జట్టుకు మరో ఆణిముత్యం లభించినట్లే కనిపిస్తున్నది. అజింక్యా రహానే, చతేశ్వర్ పుజారా, హనుమ విహారి వంటి టెస్టు స్పెషలిస్ట్ ప్లేయర్లు.. భారత జట్టు దరిదాపుల్లో లేకుండా పోగా.. విరాట్ కోహ్లీ వ్యక్తిగత కారణాలతో ఇంగ్లండ్‌తో సిరీస్‌కు దూరమయ్యాడు. మిడిలార్డర్ బాధ్యత మోయాల్సిన కేఎల్ రాహుల్ గాయంతో జట్టుకు దూరం కాగా.. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోలేక శ్రేయస్ అయ్యర్, రజత్ పాటిదార్ ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి సమయంలో ఆడుతున్న రెండో టెస్టులోనే ఓ ప్లేయర్ అందరి దృష్టిని ఆకట్టుకున్నాడు. పట్టుమని పది లిస్ట్-ఏ మ్యాచ్‌లు ఆడిన అనుభవం కూడా లేని ఆ కుర్రాడు.. ఇంగ్లిష్ బ్యాటర్ల బౌలింగ్ దాడిని సమర్థంగా ఎదుర్కొంటూ పరుగులు రాబట్టాడు.ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 17 మ్యాచ్‌లే ఆడినా.. 50కి పైగా సగటుతో పరుగులు చేసిన అతడి ప్రతిభ.. అంతర్జాతీయ స్థాయిలోనూ పనికి వచ్చింది. మనమిప్పటి వరకు చెప్పుకుంది ఉత్తరప్రదేశ్ వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ చంద్ జురెల్ గురించే! వృద్ధిమాన్ సాహా, రిషబ్ పంత్ లేని లోటును పూడుస్తాడనుకున్న తెలుగు కీపర్ శ్రీకర్ భరత్ చేజేతులా చాన్స్‌లు చెడగొట్టుకోగా.. ఈగోకు వెళ్లిన ఇషాన్ కిషన్ అవకాశాలు చేజార్చుకున్నాడు. ఇలాంటి సమయంలో నేనున్నానంటూ ధ్రువ్ దూసుకొచ్చాడు. రాజ్‌కోట్ టెస్టు ద్వారా అరంగేట్రం చేసిన ధ్రువ్ (46బీ 2 ఫోర్లు, 3 సిక్సర్లు) తన ఇన్నింగ్స్‌లోనే తన బ్యాటింగ్ సామర్థ్యం ఏంటో ప్రపంచానికి చాటాడు. సహచరులు అండగా ఉన్నంతసేపు నింపాదిగా ఆడిన ధ్రువ్.. ఆ తర్వాత తనలోని విధ్వంసక ఆటగాడిని పరిచయం చేశాడు. కొలత వేసినట్లు కొట్టే బౌండ్రీలు.. హద్దులు చెరిపేసేలా బాదే సిక్సర్లు అతడి ప్రతిభను బయటపెట్టగా.. రాంచీ టెస్టుకు వచ్చేసరికి జురెల్‌లో ధాటిగా ఆడగల బ్యాటర్‌తో పాటు.. మంచి యాంకర్ కూడా ఉన్నాడని తెలిసిపోయింది.నాలుగో మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 353 పరుగులు చేయగా.. ప్రతిగా.. మన టాపార్డర్ విఫలమవడంతో 177కే 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఇలాంటి దశలో ఇంగ్లండ్ బౌలర్లు జోరు పెంచగా.. కుల్దీప్ అండతో ధ్రువ్ చెలరేగిపోయాడు. ఈ మ్యాచ్‌లో భారత్ తిరిగి పోటీలోకి రాగలిగింది అంటే అది ధ్రువ్ పోరాటం వల్లే అని చెప్పడంలో మాత్రం సందేహం లేదు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో 192 పరుగుల లక్ష్యఛేదనలో 120కి 5 వికెట్లు కోల్పోయిన స్థితిలో క్రీజులోకి వచ్చిన ధ్రువ్.. చివరి వరకు అజేయంగా నిలిచి మ్యాచ్‌ను ముగించడంతో పాటు సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. వ్యక్తిగత మైలురాళ్ల కన్నా జట్టు విజయానికే అధిక ప్రాధాన్యత ఇస్తానంటున్న జురెల్ ఇదే జోరు కొనసాగిస్తే.. భారత టెస్టు జట్టుకు మంచి వికెట్ కీపర్ బ్యాటర్ దొరికినట్లే!



# బెంగళూరు టాప్‌షో..
## గుజరాత్‌పై ఘనవిజయం


మహిళల ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండో విజయం సాధించింది. మంగళవారం జరిగిన పోరులో బెంగళూరు 8 వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తుచేసింది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన స్మృతి మంధన సాంథ్యంలోని బెంగళూరు పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది.హేమలత (31) టాప్ స్కోరర్ కాగా.. కెప్టెన్ బెత్ మూనీ (8), లిచ్‌ఫీల్డ్ (5), వేద కృష్ణమూర్తి (9), ఆష్లే గార్డ్‌నెర్ (7), క్యాథరిన్ బ్రైస్ (3) విఫలమయ్యారు. బెంగళూరు బౌలర్లలో సోఫియా 3, రేణుక రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో బెంగళూరు 12.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 110 రన్స్ కొట్టింది. ఓపెనర్ స్మృతి మంధన (27 బంతుల్లో 43బీ 8 ఫోర్లు, ఒక సిక్సర్), సబ్బినేని మేఘన (36 నాటౌట్) మెరుపులు మెరిపించారు.



# వెబ్ సిరీస్ చూసి ఎమోషనల్ అయిన మహేష్ బాబు..
# ఇంతకీ ఏ సిరీస్ అంటే.?



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ నిర్మాతగా మారి తెరకెక్కించిన తాజా వెబ్ సిరీస్ 'పోచర్' ఈ సిరీస్‌ను ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోతో కలిసి అలియా భట్ నిర్మించింది. ప్రస్తుతం ఈ వెబ్ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వెబ్ సిరీస్ చూసిన సూపర్ స్టార్ మహేష్ బాబు 'పోచర్'పై ప్రశంసల వర్షం కురిపించాడు.ఎవరైనా ఏనుగులను అలా ఎలా చంపగలరు. వారికి మానవత్వం లేదా? అలా చేస్తున్నప్పుడు వారి చేతులు వణకడం లేదా? ఈ క్రైమ్-థ్రిల్లర్ చూస్తున్నప్పుడు నా మైండ్ లో ఇవే ప్రశ్నలు తిరుగుతూ ఉన్నాయి. ఈ జెంటిల్ జెయింట్స్ ని కాపాడుకునేందుకు సమాజంలో ప్రతి ఒక్కరు పోరాడాలి అంటూ మహేష్ రాసుకొచ్చాడు. కాగా ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.వెబ్ సిరీస్ చూసి ఎమోషనల్ అయిన మహేష్ బాబు.. ఇంతకీ ఏ సిరీస్ అంటే.? బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ నిర్మాతగా మారి తెరకెక్కించిన తాజా వెబ్ సిరీస్ 'పోచర్' ఈ సిరీస్‌ను ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోతో కలిసి అలియా భట్ నిర్మించింది. ప్రస్తుతం ఈ వెబ్ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వెబ్ సిరీస్ చూసిన సూపర్ స్టార్ మహేష్ బాబు 'పోచర్'పై ప్రశంసల వర్షం కురిపించాడు.




# 'పుష్ప ది రూల్'..
# ఆ ఒక్క ఎపిసోడ్ కోసం రూ. 50 కోట్లు!

ప్రస్తుతం ఇండియాలో మోస్ట్ అవైటెడ్ మూవీ ఏదైనా ఉందా? అంటే అది పుష్ప-2 అనే చెప్పాలి. లెక్కల మాస్టార్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్‌లో 2022 డిసెంబర్‌లో వచ్చిన పుష్ప సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. తగ్గేదేలే.. అంటూ బన్నీ చెప్పిన డైలాగ్ దేశవ్యాప్తంగా సినీ అభిమానులకు తెగ నచ్చేసింది. ఈ సినిమా సెకండ్ పార్ట్ ఎప్పుడెప్పుడు వస్తుందా? అని సినీ అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

ఈ మూవీలో ఇంటర్వెల్ సీన్ గంగమ్మ జాతర బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఇంటర్వెల్ సీన్ కోసమే మేకర్స్ రూ.50 కోట్లు ఖర్చుపెట్టినట్లు టాక్ వినిపిస్తోంది. గంగమ్మ జాతర సీక్వెన్స్ దాదాపు 25 నిమిషాలు ఉండనున్నట్లు తెలుస్తోంది. దీంతో మూవీ ఎంత గ్రాండ్‌గా ఉంటుందోనని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చిత్తూరు, తిరుపతిలోని ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో ఈ సినిమా కథ సాగనుండగా.. తిరుపతిలోని స్థానిక గంగమ్మ జాతరలోని సంప్రదాయాన్ని సుక్కు ఈ సినిమాలో చూపించనున్నాడు.



## వార్తలు నిజమేనా? నిర్ణయాలు వేగవంతంగా తీసుకోవడంలో మాస్టర్
## నందమూరి బాలకృష్ణ

నిర్ణయాలు వేగవంతంగా తీసుకోవడంలో మాస్టర్ నందమూరి బాలకృష్ణ. కథ నచ్చితే దర్శకుడికి అనుభవం లేకపోయినా అవకాశాలిచ్చేస్తారాయన. దానికి చాలా ఉదాహరణలున్నాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో బాలయ్య వార్తలకున్నంత డిమాండ్ ఎవరికీ లేదు. ఆయన విజయాలే దానికి కారణం కావొచ్చు. రేటింగులకోసం ఏదో ఒక బాలయ్య వార్తని వండి వార్చేయడం నెటిజన్స్‌కి పరిపాటైపోయింది. రీసెంట్‌గా బాలయ్యకు సంబంధించిన రెండు వార్తలు సోషల్ మీడియాలో హల్‌చల్



చేస్తున్నాయి. 'శ్యామ్‌సింగరాయ్' దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కథను బాలయ్య ఓకే చేశారనేది అందులో తొలి వార్త.బాలయ్యకోసం 'శ్యామ్ సింగరాయ్' తరహాలో పీరియాడిక్ నేపథ్యంతో రాహుల్ కథను తయారు చేశాడని, ఆ కథ బాలయ్యకు కూడా బాగా నచ్చడంతో ఆయన ప్రొసీడ్ అన్నారని, ప్రస్తుతం చేస్తున్న బాబీ సినిమా పూర్తవ్వగానే బాలయ్య ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొంటారనేది

ఆ వార్త సారాంశం. ఇక రెండో వార్త విషయానికొస్తే.. మోహన్‌బాబు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భక్తిరసాత్మక చిత్రం 'కన్నప్ప'లో బాలయ్య కూడా భాగం కానున్నారట. ఇందులో ఇప్పటికే మోహన్‌లాల్, ప్రభాస్, శివరాజ్‌కుమార్ నటిస్తున్నారని చిత్రబృందం ప్రకటించింది.

## సెన్సార్ కంప్లీట్ చేసుకున్న వెన్నెల కిషోర్ 'చారి 111'



టాలీవుడ్ స్టార్ కమెడియన్ వెన్నెల కిషోర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'చారి 111' తమిళ ముద్దుగుమ్మ సంయుక్త విశ్వనాథన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. టీజీ కీర్తికుమార్ ) ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా మార్చి 01న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో ప్రమోషన్స్ వేగం పెంచారు మేకర్స్. ఇప్పటికే ఈ సినిమా నుంచి టీజర్‌తో పాటు ట్రైలర్ విడుదల చేయగా.. ప్రేక్షకుల నుంచి విపరీతమైన స్పందన వచ్చి ంది.ఇది లావుంటే తాజాగా ఈ సినిమా సెన్సార్ కంప్లీట్ చేసుకుంది. సెన్సార్ సభ్యులు ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చారు. మరోవైపు ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ మొదలైనట్లు చిత్రబృందం ప్రకటించింది.ఈ సినిమా కథ విషయానికి వస్తే.. టెర్రరిజంకు చెందిన ఒక సీక్రెట్ గ్రూప్ ఇండియాలో కోవర్ట్ ఏజెన్సీని స్టార్ట్ చేయాలనీ చూస్తుంది. ఒకవేళ అది స్టార్ట్ అయితే దేశానికి ప్రమాదం. ఇక ఇది కనిపెట్టే సీక్రెట్ స్పైగా ఏజెంట్‌గా వెన్నెల కిషోర్ కనిపించనున్నారు. ఇక సీనియర్ నటుడు మురళి శర్మ ఈ సినిమాలో స్పై ఏజెన్సీ హెడ్?గా కనిపించనున్నారు.

# 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' ఓటీటీ డేట్ వచ్చేసింది..




## స్ట్రీమింగ్ ఎప్పుడంటే

టాలీవుడ్ నటుడు, కలర్‌ఫొటో ఫేమ్ సుహాస్ హీరోగా నటించిన తాజా చిత్రం 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' . దుశ్యంత్ కటికినేని ఈ చిత్రానికి దర్శకత్వం వహించగా. శివాని నగరం హీరోయిన్‌గా నటిచింది. రూరల్ బ్యాక్ డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం ఫిబ్రవరి 02న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్ అందుకుంది. ఇప్పటివరకు ఈ చిత్రం రూ.15 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఇక బాక్సాఫీస్ వద్ద అలరించిన

ఈ చిత్రం ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమయ్యింది.ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక ఆహాలో ఈ సినిమా మార్చి 01 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించింది. ఈ విషయాన్ని చిత్రయూనిట్ ఎక్స్ వేదికగా ప్రకటించింది. ఇక ఈ సినిమాలో సుహాస్ హెయిర్ సెలూన్ నడిపిస్తూ.. మరోవైపు మ్యారేజి బ్యాండు టీంలో కలిసి పనిచేస్తూ.. శివానీతో లవ్‌లో పడే యువకుడిగా కనిపించాడు. ఈ మూవీలో పుష్ప ఫేం జగదీశ్ ప్రతాప్ బండారి, గోపరాజు రమణ కీలక పాత్రల్లో నటించారు. గీతా ఆర్ట్స్ 2, మహాయణ మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా తెరకెక్కించాయి.

# మూడు హిస్టారికల్ వెబ్ సిరీస్‌లతో వస్తున్న 'జై భోలో తెలంగాణ' దర్శకుడు

టాలీవుడ్ దర్శకుడు ఎన్. శంకర్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. 'ఎన్‌కౌంటర్, 'శ్రీరాములయ్య', 'జయం మనదేరా', 'ఆయుధం', 'భద్రాచలం', జై భోలో తెలంగాణ' వంటి ఎన్నో బ్లాక్ బస్టర్ చిత్రాలను ప్రేక్షకులకు అందించి మంచి క్రేజ్ సొంతం చేసుకన్నారు. అయితే చాలా రోజుల తర్వాత ఎన్.శంకర్ వెబ్ సిరీస్‌లతో రీ ఎంట్రీ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'ఎన్.శంకర్ టీవీ అండ్ ఫిల్మ్ స్టూడియో' బ్యానర్‌లో ఆయన నిర్మాతగా, దర్శకత్వ పర్యవేక్షణలో చారిత్రాత్మక కథాంశాలతో రూపొందనున్న మూడు వెబ్‌సిరీస్‌ల విశేషాలు గురించి ఎన్.శంకర్ తెలియజేశారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం. తెలంగాణ సాయిధ పోరాటంలో ప్రజలే సైనికులుగా యుద్ధం చేయాల్సి వచ్చిన పరిస్థితులు, భూస్వామ్య వ్యవస్థలో సామాన్యుల మీద జరిగిన దాడులు.. ప్రజలు, ముఖ్యంగా మహిళల ప్రతిఘటన మొదలుకుని, తెలంగాణ ప్రాంతం ఇండియన్ యూనియన్‌లో కలంబడటం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పడిన తరువాత జరిగిన పరిణామాలు, పాలకుల నిర్ణయాలు.. రాజకీయ, సామాజిక, ఆర్థిక అసమానతలు, ప్రజల తరపున ఉద్యమాలు, విప్లవపార్టీల భావజాలంతో పాటు, ప్రజాస్వామ్య బద్ధంగా జరిగిన పోరాటాల కొనసాగింపుగా.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం, జరిగిన పోరాట నేపథ్యంలో జరిగిన ఎన్నో ఉద్యమాలు, వాటిలో జరిగిన ఆటుపోట్లు గురించి.. ప్రజల కోణంలో అర్థవంతంగా, చూపించాలనే సంకల్పంతో ఈ వెబ్‌సిరీస్‌కు శ్రీకారం చుడుతున్నాం. దీనికి సంబంధించిన షూటింగ్ పనులు అక్టోబర్ నుంచి మొదలవుతుంది.మహాత్మ జ్యోతీరావు పూలే స్ఫూర్తితో.. రెండవ వెబ్‌సిరీస్‌మహాత్మ జ్యోతీరావు పూలే అనుభవాలు, ఆయన జీవితంలో జరిగిన సంఘటనలు, సంఘర్షణలు (ఆయన బయోగ్రఫీ కాదు) పేదలకు, మహిళలకు విద్యను భోదించటం కోసం, తన



సతీమణి సావిత్రిబాయి గారి ద్వారా తన సంకల్పానికి శ్రీకారం చుట్టి, ఆనాటి దురాచారాల పట్ల తిరుగుబాటు చేసిన క్రమంలో, ఆయన ఎదుర్కొన్న సమస్యలు, అవమానాలు, త్యాగాలు, ఆయన చేసిన భోదన కథాంశంగా రెండవ వెబ్ సిరీస్ తెరకెక్కనుంది.బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో మూడో వెబ్ సిరీస్ఇది బాబా సాహెబ్ అంబేద్కర్ బయోగ్రఫీ కాదు. ఆయన ఈ దేశానికి , అట్టడుగు ప్రజలకు, అణగారిన వర్గాలకు ఇచ్చిన గొప్ప రాజ్యాంగ స్ఫూర్తిని, ఆయన వ్యక్తిగత జీవితంలో అనుభవించిన బాధలను, తన ధృడ సంకల్పం, వ్యక్తి నుండి వ్యవస్థగా తను మారడానికి మద్య జరిగిని సంఘర్షణలు ఇతి వృత్తంగా మూడో వెబ్ సిరీస్ వర్క్ జరుగుతుంది.అవి బయోగ్రఫీలు కావు: శంకర్‌మహాత్మ జ్యోతిరావు పూలేతో పాటు డా.బాబాసాహెబ్ అంబేద్కర్‌ల వెబ్ సిరీస్‌లు వారి బయోగ్రఫీలు కాదు. వారి జీవితాల్లో జరిగిన సంఘటనలు, ప్రజల పట్ల వాళ్లకున్న కమిట్‌మెంట్, సమాజంలో సమానతల కోసం వారు చేసిన నిజాయితీ పోరాటం, వారి నిజ జీవితంలో జరిగిన సంఘర్షణలు, గౌరవాలు , బ్‌సిరీస్‌లు చేస్తున్నాం.

**Owner, Editor, Printed & Published :** Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District -500098. Telangana. Printed at S.A Printers,D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District -500098, Telangana, RNI NO : TELTEL/2023/86487 Cell: 8125972476. website : quicktodaynews@gmail.com, e-mail : gbuchireddy79@gmail.com